



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెద్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 136 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 07 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




# వణికించిన పులి.. ముగిసిన బంది!

**650 కిలోమీటర్ల యాత్రకు కూర్మాపురంలో 'చెక్'**

**తడోబా టు కోనసీమ.. గజగజలాడించిన బెంగాల్ టైగర్!**

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అది అభయారణ్యం కాదు.. కానీ అడవి పులి అక్కడ అడుగు పెట్టింది. అది జనారణ్యం.. కానీ మృగరాజు గాండ్రింపుతో వణికిపోయింది! గత కొన్ని రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన 'మహా' యాత్ర ఎట్టకేలకు ముగిసింది. మహారాష్ట్ర నుంచి గోదావరి దాటి వచ్చిన పెద్దపులి, శుక్రవారం రాయవరం మండలం కూర్మాపురంలో అధికారుల వ్యూహానికి చిక్కి బోనులో బందీ అయ్యింది.

**అంతుచిక్కని వేగం.. అనూహ్య ప్రయాణం!**

మహారాష్ట్రలోని తడోబా అడవుల నుండి బయలుదేరిన ఈ పులి ప్రయాణం సామాన్యమైంది కాదు. దాదాపు 650 కిలోమీటర్లు, అడవులు, కొండలు, వాగులు దాటుకుంటూ, మిగతా .. 2లో..



# భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీ

- 2027 డిసెంబరు నాటికి అందరికీ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకం
- 14 విశిష్ట భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకం... రికార్డుల ట్యాంపరింగ్‌కు ప్రయత్నిస్తే జైలుకే
- తాడేపల్లి వద్ద హెలిపాడ్ కోసం ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారు
- కర్నూలు జిల్లా కలుగట్లలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో సీఎం చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2027 డిసెంబరు నాటికి సర్వే పూర్తి చేసి రాష్ట్రంలో రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కలుగొట్ల గ్రామంలో మీ భూమి- మీహక్కు కింద పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. భవిష్యత్ లో ఎవరూ ట్యాంపరింగ్ చేయకుండా, ఒక్క పైసా అవినీతికి తావు లేకుండా రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్ తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎవరైనా ట్యాంపరింగ్ కు ప్రయత్నిస్తే నేరుగా జైలుకే వెళతారని, అవసరమైతే పీడీ యాక్టు కింద కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ...మీ భూమికి భద్రత కల్పించడం నాకు ఆనందాన్నిస్తోంది. భూమి ఆస్తి ఒక్కటే కాదు..అది మన జీవనాధారం. కుటుంబానికి భద్రత. భవిష్యత్‌కు నమ్మకం. కూటమి ప్రభుత్వం భూమి- నీరు-సాగుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వివాదాలు లేని భూములు, పుష్కలంగా ప్రతి ఎకరాకు నీరు, లాభాలు తెచ్చిపెట్టేలా సాగును ప్రోత్సహించటమే లక్ష్యాలుగా పెట్టుకుని పనిచేస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడమే నా జీవితాశయం. కర్నూలు జిల్లాలో పశ్చిమ తాలూకాకు నీరు అందిస్తే రాష్ట్ర మంతటా మిగతా .. 2లో..

ఇంటర్నెట్ చీప్ అని..

# సమయం వృథా చేసుకోకండి

**విద్యార్థులతో ప్రధాని నరేంద్ర మోదీ**



**విశ్వం వాయిస్ న్యూస్ :** పరీక్షల ముందు ఒత్తిడిలో ఉండే విద్యార్థుల్లో సరికొత్త ఉత్సహాన్ని నింపేలా పరీక్షాపే చర్చా కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారితో మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. ఆ సందర్భంగా వారు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను శుక్రవారం మోదీ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. "పరీక్షలను సానుకూలంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడం గురించి విద్యార్థులతో మిగతా .. 2లో..

టీం 11 కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయి హత్యకు

# బ్రాండ్ అంబాసిడర్లు

- దేవుడుని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచేశారు
- నేడు క్లీన్ చిట్ వచ్చిందంటూ టీం 11 తప్పుడు ప్రచారం
- టీం 11 దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి
- విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది
- దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో ఏపీకి 25శాతం వస్తున్నాయి
- బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్ నిర్మాణం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్ మెంట్ వర్క్ షాప్ లో మంత్రి లోకేష్ దిశానిర్దేశం



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** టీం 11 కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లు. దేవుడుని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచేశారు. నేడు క్లీన్ చిట్ వచ్చిందంటూ టీం 11 తప్పుడు ప్రచారం. టీం 11 దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన బూత్ మేనేజ్ మెంట్ వర్క్ షాప్ లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులు పార్టీకి దూరమవుతారు. ఇది జరగకూడదు. పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు అని మనం జీవితాంతం గుర్తు పెట్టుకోవాలి. నాయకులు ఎంత ఎదిగినా, ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా చివరకు వచ్చేది మన దేవాలయం టీడీపీ ఆఫీసుకే అని చంద్రబాబు గారు చెప్పారు. పార్టీని మనం బలోపేతం చేసుకోవాలి. పార్టీ కోసం మనం అహర్నిశలు కష్టపడాలి. సమాజంలో మనకు గౌరవం దక్కుతోందన్నా, ప్రభుత్వంలో గౌరవం దక్కుతోందన్నా అందుకు కారణం మన పార్టీ అని గుర్తుంచుకోవాలి. టీడీపీకి బూత్ అనేది గుండెలాంటిది. 2019 ఎన్నికల దగ్గర నుంచి బూత్ లెవల్ లో మన పనితీరు ఎలా ఉంది అనేది చూడాలి. వేవ్ వచ్చినా కొన్ని కారణాల వల్ల కొన్ని బూత్ లలో మిగతా .. 2లో..

హిందూ ధర్మంపై దాడి జరిగితే

# హిందువులంతా గొంతెత్తాలి

**ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మన హిందూ ధర్మాన్ని మనమే రక్షించుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రతి భక్తుడికీ ధర్మాన్ని కాపాడే బాధ్యత ఉందని 'ఎక్స్'లో పోస్టు చేశారు. "దేవుళ్లను ఎవరైనా అవమానిస్తే హిందువులు వ్యక్తిగతంగానే బాధపడతారు. ఎవరు చేసిన కర్మ వారే అనుభవిస్తారని భావిస్తారు. హిందువుల్లో ఈ ఉదాసీన వైఖరి మారాలి. కుల, ప్రాంత, భాష విభేదాలున్నా హిందూ ధర్మం ఒక్కటే. హిందూ ధర్మంపై దాడి జరిగితే హిందువులంతా గొంతెత్తాలి. మన ధర్మాన్ని మనమే రక్షించుకోవాలి. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం ఎవరికీ వ్యతిరేకం కాదు" అని పవన్ సంచలన ట్వీట్ చేశారు.

# వెంటనే ఇరాన్ వీడండి


**తన పౌరులకు అమెరికా అడ్వైజరీ**

**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగశాఖ జారీ చేసిన అడ్వైజరీ ఆందోళన కలిగిస్తోంది. 'వెంటనే ఇరాన్‌ను వీడండి' అంటూ యూఎస్ తన పౌరులను అప్రమత్తం చేసింది. "వెంటనే వీడటం వీలుకాకపోతే.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి" అంటూ అడ్వైజరీ జారీ అయింది. అయితే నెటిజన్లు కొందరు మిగతా .. 2లో..

కల్తీ నెయ్యితో శ్రీవారి ప్రసాదాన్ని

# అపవిత్రం చేసిన మోసగాళ్లు

**మంత్రి వంగలపూడి అనిత**



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి పాలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక పీడకలని, అడుగడుగునా కల్తీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు లాగా జగన్ "కల్తీ రిక్రూట్‌మెంట్ బోర్డు" అనే వ్యవస్థను స్థాపించి దానికి ఆయనే అధ్యక్షుడిగా వ్యవహరించారని ఆమె ఎద్దేవా చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న జనాభాకు మిగతా .. 2లో..

శ్రీవారి భక్తుల మనోభావాలు

# దెబ్బతినకుండా పని చేస్తా

**తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర**



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారిపై భక్తి విశ్వాసాలు సన్నగిల్లకుండా, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పని చేస్తానని తితిదే ఈవో, ఆంధ్రప్రదేశ్ సీఎంవో ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర అన్నారు. తితిదే ఈవోగా ఆయన మిగతా .. 2లో..

స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో

# ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలి

**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి**




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శుక్రవారం జిల్లా, మండల, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులకు, అర్బన్ స్వర్ణ వార్డు అధికారులకు రెండు రోజుల మిగతా .. 2లో..

పాకిస్థాన్‌లో భారీ పేలుడు..

# 30 మందికి పైగా మృతి

**ఇస్లామాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్‌లో భారీ ఆత్మాహుతి దాడి చోటు చేసుకుంది. రాజధాని ఇస్లామాబాద్‌లోని షియాలకు చెందిన ఓ ప్రార్థనా మందిరం దగ్గర జరిగిన ఈ ఘటనలో 30 మందికి పైగా మృతి చెందారు. మరో 160 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ బృందాలు.. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ఇస్లామాబాద్‌లోని షెహజాద్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రార్థనా మందిరం గేటు దగ్గరకు చేరుకున్న ఓ సూసైడ్ బాంబర్.. ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ప్రార్థనల సమయంలో ఈ ఘటన జరగడంతో తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనకు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# వణికించిన పులి.. ముగిసిన బందీ!

చివరికి గోదావరి నదిని సైతం ఈదుకుంటూ జిల్లాలోకి ప్రవేశించింది. రాజమండ్రి పరిసరాల్లో యువకుల ఫోన్ కెమెరాకు చిక్కడంతో ఈ పులి ఉనికి అధికారికంగా బయటపడింది. మండపేట నియోజకవర్గంలోని వేములపల్లి, కేశవరం ప్రాంతాల్లో సంచరిస్తూ అధికారులకు సవాల్ విసిరింది.

**గురువారం రాత్రి తప్పించుకుంది.. శుక్రవారం చిక్కింది!**

మండపేట మండలంలో పులి కోసం అధికారులు వల పన్నగా, అందరినీ బురిడీ కొట్టించి రాత్రికి రాత్రే 50 కిలోమీటర్లు ప్రయాణించి కూర్మాపురం చేరుకుంది.

ఉదయం 8:00: కూర్మాపురంలోని ఒక పాత పెంకుటిల్లులో పులి గాండ్రింపులు. గ్రామస్థుల భయాందోళన.

ఉదయం 10:00: రంగంలోకి అటవీ, పోలీస్ శాఖల భారీ బలగాలు. డ్రోన్ కెమెరాలతో వేట మొదలు.

మధ్యాహ్నం 1:00: ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పర్యవేక్షణ, ప్రజలను అప్రమత్తం చేస్తూ విజ్ఞప్తి.

సాయంత్రం: వరి పొలాల్లో పరుగులు తీసి, చివరకు ఒక తాటాకు పాకలోకి చేరిన పులి.

**ఊపిరి బిగబట్టేలా రెస్క్యూ ఆపరేషన్!**

తాటాకు పాకలో దూడను తింటున్న పులిని పట్టుకునేందుకు రెస్క్యూ టీం ప్రాణాలకు తెగించింది. పాక చుట్టూ వలలు కట్టి, సిబ్బంది పైకి ఎక్కి మత్తు ఇంజక్షన్ ఇచ్చే ప్రయత్నం చేశారు. అలికిడికి పులి బయటకు దూకగా, అప్పటికే సిద్ధంగా ఉన్న షూటర్లు గురి తప్పకుండా మత్తు ఇంజక్షన్లు ఇచ్చారు. కొంత దూరం పరిగెత్తి పులి కుప్పకూలిపోవడంతో, అధికారులు చాకచక్యంగా దానిని బంధించి ఇనుప బోనులోకి చేర్చారు.

**మండపేట టూ రాయవరం.. ఊపిరి పీల్చుకున్న ప్రజలు**

పులి పట్టుబడటంతో జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠకు తెరపడింది. "అడవి నుంచి వచ్చిన అతిథికి కూర్మాపురంలో వీడ్కోలు పలికారు" అంటూ స్థానికులు చమత్కరిస్తున్నారు. పోలీస్, అటవీ శాఖల సమన్వయం వల్లే ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ఆపరేషన్ విజయవంతమైందని ఉన్నతాధికారులు వెల్లడించారు.

**పులి పట్టివేతలో విశేష ప్రతిభ: పూణే రెస్క్యూ బృందానికి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రత్యేక అభినందనలు**

జిల్లాలో గత కొద్ది రోజులుగా కలకలం రేపిన పెద్దపులిని అత్యంత జాగ్రత్తగా, శాస్త్రీయ పద్ధతుల్లో పట్టుకున్న పూణే రెస్క్యూ బృందాన్ని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం రాత్రి పులిని ట్రాంక్విలైజ్ చేసిన అనంతరం, అది కొంత దూరం పొలాల వైపు కదలడంతో అటవీశాఖ బృందాలు అప్రమత్తంగా వెంబడించి, ఎలాంటి ప్రమాదం జరగకుండా కేజింగ్ చేయడంలో రెస్క్యూ టీమ్ విజయం సాధించాయన్నారు. పులి నేలకూలిన వెంటనే రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకుని భద్రతా చర్యలు చేపట్టాయి. అటవీశాఖ, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో సీసీఎఫ్ రాజమహేంద్రవరం, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, ఏసీపీ నార్త్, డీఎస్పీ ఈస్ట్, డీపీఆర్‌ఓతో పాటు విజాగ్ జూ నుంచి వెటర్నరీ డాక్టర్లు ఫణీంద్ర, భాను కీలక పాత్ర పోషించారనీ జిల్లా అటవీ అధికారి బి ప్రభాకర రావు తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది, పోలీస్, అటవీ, రెవెన్యూ శాఖల సిబ్బంది అందరూ అహర్నిశలు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి బి. ప్రభాకర రావు మాట్లాడుతూ, "సీసీఎఫ్ గారి ముందడుగు వేసి పూణే నుంచి ప్రత్యేక రెస్క్యూ బృందాన్ని రప్పించకపోతే ఈ ఆపరేషన్ ఎంతో కష్టసాధ్యంగా మారేదన్నారు. మా అటవీశాఖ బృంద నాయకుడు దావీద్ సహా సిబ్బంది రాత్రింబగళ్లు కష్టపడి పనిచేశారు. సహకరించిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు," అని తెలిపారు. పట్టుబడిన పులిని సురక్షితంగా రాజమహేంద్రవరం తీసుకువచ్చే ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు.

# భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీ

నీరు ఇచ్చినట్టే. వారసత్వంగా వచ్చిన ఆస్తిపై వేరే వారి ఫొటోలు వేయడమేంటని గత ఎన్నికల్లో నేను ప్రశ్నించాను. గత పాలకులు తప్పుడు విధానాలతో ప్రజలను బానిసలు చేయాలని కుట్ర చేశారు. లోపభూయిష్టమైన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తెచ్చారు. ప్రజల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. పట్టాదారు పాసు పుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై వారి ఫొటోలు, పేర్లు ముద్రించుకున్నారు. వాళ్లు అడిగిన భూములు ఇవ్వకపోతే 22 ఏలో పెట్టారు. కక్ష తీర్చుకోవడానికి అన్ని ఆయుధాలు ఉపయోగించారు. ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు పులివెందుల నుంచి మనుషులను తెచ్చుకున్నారు. రీ సర్వే పేరుతో రూ.700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. పట్టాదారు పాసు పుస్తకాలపై ఫొటోలు వేసుకోవడం శాడిజం కాదా? లక్షల ఎకరాల ప్రైవేటు భూములను ప్రభుత్వ భూములుగా మార్చేశారు. రికార్డులు తారుమారు చేశారు. తాడేపల్లి ప్యాలెస్ పక్కన హెలీప్యాడ్ కోసం..70 ఏళ్లుగా పక్కా డాక్యుమెంట్లు ఉన్న భూమిని ఒక వ్యక్తి దగ్గర బలవంతంగా తీసుకుని ప్రభుత్వ భూమిగా మార్చేశారు. ఇదేమని అడిగితే 22 ఏలో పెట్టి వివాదం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల వద్ద నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో 80 శాతం పైగా అర్జీలు రెవెన్యూ పరమైనవే వస్తున్నాయి. రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించి ఏమీ తెలీనట్టు గత ఐదేళ్లు బ్రహ్మాండంగా పాలన చేసినట్టు మాట్లాడుతున్నారు. మీరు సమర్థవంతంగా పని చేస్తే ఇన్ని సమస్యలు ఎలా వచ్చాయి? నేను నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాను. నా జీవితంలో ఇలాంటి భూ సమస్యలు ఎప్పుడూ చూడలేదని" సీఎం చంద్రబాబు అన్నారు.

**పైసా అవినీతి లేకుండా పాస్ పుస్తకాల పంపిణీ**

"అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. భవిష్యత్ లో ఎవరూ ప్రజల భూమిపై కన్ను వేయకుండా భద్రత కల్పిస్తున్నాం. ప్రతీ పాస్ పుస్తకానికి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్, యూనిక్ నెంబర్ ఉంటుంది. ఎవరైనా సరే ఈ క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలను వెంటనే తెలుసుకోవచ్చు. మీ పాసు పుస్తకంలో ఉన్న క్యూఆర్ కోడ్ ను మీ ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే అందులో వచ్చే మ్యాప్ మిమ్మల్ని నేరుగా మీ పొలం వద్దకు తీసుకు వెళుతుంది. డాక్యుమెంట్ల వివరాలను ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చైన్ లాంటి పటిష్ట వ్యవస్థను తెస్తున్నాం. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. మీ రికార్డులన్నీ మీ అనుమతితోనే చేస్తున్నాం. ముందుగా డ్రాఫ్ట్ పట్టా దార్ పాస్‌బుక్ జారీ చేసి అందులో వ్యక్తిగత వివరాలు, భూమి వివరాలు సరిగ్గా ఉన్నాయో, లేవో భూ యజమానులు నిర్ధారించుకునే అవకాశం ఇచ్చాం. వఖ్జ ధృవీకరణ తప్పనిసరిగా తీసుకుంటున్నాం. దీంతో తప్పులు దొర్లేందుకు వీలుపడదు. పైసా అవినీతి లేకుండా పట్టాదారు పుస్తకాలు ఇస్తున్నాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున రాష్ట్రంలో మొత్తం 279 గ్రామాల్లో ముందుగా పంపిణీ చేపట్టాం. ప్రస్తుతం 1,16,870 డ్రాఫ్ట్ పాస్ బుక్స్ సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 91,038 డ్రాఫ్ట్ పాస్ బుక్స్ వఖ్జ కూడా పూర్తయ్యింది. కర్నూలు జిల్లాలోని 13 గ్రామాల్లో 8,347 మందికి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. కలుగట్ల గ్రామంలో 1,178 కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసుకుంటున్నాం. ఇప్పటివరకూ 37 లక్షల 40 వేల పట్టా దారు పాస్ పుస్తకాలు సిద్ధమయ్యాయి. ఇందులో 19 లక్షలు లక్షలు ఇప్పటికే పంపిణీ చేయగా..18 లక్షల 40 వేలు ఏప్రిల్ లోగా పంపిణీ చేస్తాం. ఇది కాకుండా 9,500 గ్రామాల్లో సర్వే చేయాలి. అవి చేస్తే 60 లక్షల మందికి కొత్తగా పాస్ పుస్తకాలు ఇచ్చే అవకాశం వస్తుంది. 2027 డిసెంబర్ నాటికి ప్రతి ఒక్కరికీ పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జాయింట్ ఎల్పీఎంల విషయంలో వివాదాలు పరిష్కరించుకోవాలని" ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

**సీమలో ప్రాజెక్టులు టీడీపీ ఘనతే**

"రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల ఘనత టీడీపీదే. హంద్రినీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులు రావడానికి నాడు తెలుగుదేశం పార్టీ చూపిన చొరవే కారణం. తెలుగుగంగ సీమను సస్యశ్యామలం చేయడంతో పాటు చెన్నై దాహార్తి తీరుస్తోంది. నదుల అనుసంధానం చేసి సీమను సస్యశ్యామలం చేస్తాము. అనంతపురం జిల్లాలో నీటి సంరక్షణకు మేము తీసుకున్న చర్యలతో ప్రధాని మోదీ మన్ కీ బాత్ లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. సీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేస్తున్నాం. దేశంలో ఎక్కువ పండ్లు పండేది రాయలసీమలోనే. రాష్ట్రంలో 400 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు ఉత్పత్తి అయితే అందులో 220 లక్షల మెట్రిక్ టన్నులు సీమ నుంచే వస్తున్నాయి. రాబోయే రోజుల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు ఉత్పత్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వంలో 8 సార్లు చార్జీలు పెంచారు. రూ. 32 వేల కోట్ల మేర విద్యుత్ భారాన్ని మోపారు. రూ.1.20 లక్షల కోట్ల అప్పు చేశారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్ లో కరెంటు చార్జీలు పెంచబోదని హామీ ఇస్తున్నాను. నేనూ రాయలసీమలోనే పుట్టాను. ఎన్టీఆర్ కూడా సీమ ముద్దు బిడ్డే. మూడేళ్లలో కడప స్టీల్ ప్లాంట్ పనులు పూర్తి చేసే బాధ్యత నాది. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులు పెడుతున్నాం. సీమలో స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయని" ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**సాగునీటి రంగానికి మా మొదటి ప్రాధాన్యత**

"2014 -19 మధ్య సాగునీటి రంగానికి రూ. 68 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు పోలవరం ప్రాజెక్టు పాలిట శనిలా దాపురించారు. అసమర్థత, నిర్లక్ష్యంతో రూ. 440 కోట్ల విలువైన డయాఫ్రాం వాల్ దెబ్బతింది. దీని కోసం అదనంగా రూ. 1000 కోట్లు ఖర్చయింది. సమయం కూడా వృథా అయ్యింది. 2027లో పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తాం. పట్టి సీమ ద్వారా కృష్ణాడెల్టాకు గోదావరి నీరిచ్చి, శ్రీశైలం నీటిని సీమకు మళ్లించాం. పదేళ్లుగా సీమలో కరువు లేకపోవటానికి మా దూరదృష్టే కారణం. నీరుంది కాబట్టే కియాలాంటి పరిశ్రమలు వచ్చాయి. మచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులు ఉంచుకుని రాయలసీమ లిఫ్ట్ పేరుతో నాటకాలు ఆడారు. కర్నూలు జిల్లాకు నీరిచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. రాజోలి బండ, గురు రాఘవేంద్ర, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. తుంగభద్ర డ్యామ్ నుంచి వచ్చే నీరు కర్నూలు జిల్లా ఉపయోగించుకుంటే నీటి సమస్య చాలా వరకూ తీరుతుంది. ఎమ్మిగనూరులో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది వస్తే 2 వేల మంది చేనేతలకు ఉపాధి లభిస్తుంది. గాజుల దిన్నె పూర్తి చేస్తాం. రూ.138 కోట్లతో ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం అంగీకరించింది. ఎమ్మిగనూరు, ఆదోని మీదుగా రైల్వే లైన్లపై దృష్టి పెడతాం. సీమలో 120 ప్రాజెక్టులకు అనుమతి ఇస్తే గత పాలకులు అన్నిటినీ రద్దు చేశారని" ముఖ్యమంత్రి తెలిపారు.

**శ్రీవారి లడ్డూ తయారీలో రసాయనాలు**

"అత్యంత పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని వాడారు. నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు ఇచ్చిన నివేదికతో మేం మాట్లాడుతుంటే.. సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని చెప్పుకుంటున్నారు. రసాయనాలు కలిసినట్టు నివేదికలో ఉందని వాళ్ల బాబాయ్ కూడా మాట్లాడుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీటీడీ నుంచే ప్రక్షాళన మొదలుపెట్టాం. గత పాలకుల హయాంలో తయారు చేసిన లడ్డూకి ఇప్పటి లడ్డూ ప్రసాదానికి నాణ్యతలో ఎంతో వ్యత్యాసం ఉంది. శ్రీశైలంలోనూ రసాయనాలు వాడి ప్రసాదం కల్తీ చేశారు. తప్పు చేసి నన్ను క్షమాపణ చెప్పమంటున్నారు. పరామర్శల పేరుతో గుంటూరు వెళ్లేందుకు 6 గంటలు రోడ్డు బ్లాక్ చేసి మరే వాహనాలు వెళ్లకుండా ఇబ్బందులు పెట్టారు. గతంలో కాన్వాయ్ కింద సింగయ్య అనే వ్యక్తిని తొక్కించి చంపారు. బంగారుపాళ్యంలో మామిడి కాయలను కింద పడేసి బల ప్రదర్శనకు దిగారు. బలప్రదర్శన ఎన్నికల సమయంలో చేయాలి. ఇలాంటి వారిని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు. ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోను. శాంతిభద్రతల నిర్వహణలో కఠినంగా ఉంటాను. ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేయటంతో పాటు ప్రతీ రైతునూ ఆదుకుంటాం. ఉల్లికి రేటు లేకపోతే హెక్టారుకు రూ.50 వేల చొప్పున చెల్లించాం. మామిడి, కోకో పొగాకు లాంటి పంటలకూ సబ్సీడీ ఇచ్చి ఆదుకున్నాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బ్రాండ్ అంబాసిడర్లు

గెలవడం లేదు. దానికి కారణాలు అన్వేషించాల్సిన అవసరం ఉంది.

**బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్ నిర్మాణం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం**

గ్రామస్థాయి నుంచి కాదు.. బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్ నిర్మాణం చేసుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే టీడీపీ బలంగా ఉంటుంది. సీనియర్లను, జూనియర్లను సమానంగా గౌరవిస్తా. పనిచేసే వారిని ప్రోత్సహిస్తా. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా.. మనం పనిచేసిన రోజే పార్టీ బలోపేతం అవుతుంది. టీడీపీకి కోటి మంది సభ్యులు ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పనిచేసే వారిని గుర్తిస్తాం. బూత్ స్థాయి నుంచి సంస్థాగత నిర్మాణం బలంగా ఉంటే పార్టీ బాగుంటుంది అనేందుకు మంగళగిరి, గాజువాక నియోజకవర్గాలు ఓ ఉదాహరణ. ఓ అనుభవంతో నేను మీ ముందు ఉన్నా. 1985 తర్వాత మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరలేదు. ఛాలెంజ్ గా తీసుకున్నా. కానీ 2019లో 5,300 ఓట్ల తేడాతో నేను ఓడిపోయాను. ఓడిపోయిన రోజు నాకు బాధ కలిగింది. ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఓడిపోయిన చోటనే కష్టపడి పనిచేసి టీడీపీ జెండా ఎగురవేయాలని సంకల్పించా. కార్యకర్తలతో సమావేశం పెట్టుకున్నాం. బూత్ ల వారీగా సమీక్ష చేశాం. బూత్ లెవల్ నుంచి పార్టీని ఎలా బలోపేతం చేయాలని మేమంతా చర్చించాం. ఆ చర్చ తర్వాత మేం అనుకున్న నిర్ణయాలను తూచా తప్పకుండా నాలుగేళ్లు అమలుచేశాం.

**బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషిచేయాలి**

చాలా మంది రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయాలని చెప్పారు. సంస్థాగత నిర్మాణాన్ని నమ్ముకున్నాను. సంస్థాగత నిర్మాణం బలంగా ఉంటే విజయం సాధిస్తామని గట్టిగా నమ్మాను. గెలిచి చూపిస్తానని ఆనాడే చెప్పా. ఐదు జోన్లలో 4,772 బూత్ లను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు 903 మంది సీనియర్ నాయకులను నియమించి కార్యాచరణ ఇవ్వడం జరిగింది. మీరంతా బూత్ కు వెళ్లి పరిస్థితులను తెలుసుకోవాలి. కనీసం బూత్ కు ఒక్కరోజు కేటాయించాలి. అక్కడ జరుగుతున్న విషయాలు తెలుసుకోవాలి. ఆ బూత్ లో పార్టీని ఎలా బలోపేతం చేయాలో చర్చించి పార్టీకి నివేదించాలి. గతం మాదిరిగా కాకుండా పార్టీకి ఏ ఫీడ్ బ్యాక్ ఇచ్చినా సీరియస్ గా తీసుకుంటున్నాం. అందువల్లే వర్క్ షాప్ ఏర్పాటుచేయడం జరిగింది. మీ రాజకీయ భవిష్యత్ ఈ బూత్ కు ముడిపడి ఉంది. కష్టపడి పనిచేయాలి. ఐదేళ్లు కష్టపడి ఫలితాలు చూపించారు కనుకనే ఇక్కడున్న వారికి పార్టీ నేరుగా పదవులు ఇచ్చింది. రాబోయే రోజుల్లో బూత్ పెర్ఫార్మెన్స్ తోనే బేరీజు వేస్తాం. ఇది మీ బాధ్యత. నాయకులతో సమన్వయం చేసుకోవాలి.

**పసుపు జెండా కోసం ప్రాణాలను త్యాగం చేసిన కార్యకర్తలు టీడీపీ సొంతం**

దేశంలో ఎన్నో ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కానీ సంస్థాగత నిర్మాణంలో తెలుగుదేశం పార్టీ ఉన్నంత బలంగా మరే పార్టీ లేదు. నమ్ముకున్న పసుపు జెండా కోసం ప్రాణాలనే త్యాగం చేసిన కార్యకర్తలు ఒక్క టీడీపీకే సొంతం. ఏ పార్టీకి లేని కార్యకర్తలు టీడీపీకి ఉన్నారు. అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ, తోట చంద్రయ్యలే నాకు స్ఫూర్తి. అందరం కష్టపడి పనిచేద్దాం. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. రూ.2కే కిలోబియ్యం, రైతులకు రూ.50కే హార్స్ పవర్ విద్యుత్, జనతా వస్త్రాల పంపిణీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు.

**టీం 11 కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లు**

తెలుగుజాతి గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుకుంటున్నారంటే దానికి కారణం చంద్రబాబు గారు. ఆనాడు సైబరాబాద్ నిర్మిస్తే చాలా మంది ఎగతాళి చేశారు. నేడు కోట్లాది మందికి ఐటీ అన్నం పెట్టింది. మన రాష్ట్రంలో టీం 11 ఉంది. అర్థమైందా రాజా? టీం 11 కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లు. కల్తీ నెయ్యిలో క్లీన్ చిట్ వచ్చిందని టీం 11 కెప్టెన్ చెబుతున్నారు. ఈ మహానుభావుడు ఏం చదివాడో నాకు అర్థం కాలేదు. చార్జిషీట్ ఇంగ్లీష్ లో ఉంది. అసలు ఆయనకు ఇంగ్లీష్ వచ్చా? దేవుడిని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచేశారు. రూ.250 కోట్ల అవినీతికి పాల్పడి నేడు క్లీన్ చిట్ వచ్చిందని చెబుతున్నారు. టీం 11 దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనపై ఉంది. 2019లో బాబాయి వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని దుష్ప్రచారం చేశారు. అది గుండెపోటు కాదు.. గొడ్డలిపోటు అని తర్వాత తెలిసింది. వారే చంపి చంద్రబాబు గారిపై నెపం వేశారు. వివేకానందరెడ్డిని అవినాష్ రెడ్డి చంపాడని జగన్ రెడ్డికి తెలుసు. అయినా దుష్ప్రచారం చేశారు. వైసీపీ దుష్ప్రచారాన్ని సరైన సమయంలో తిప్పికొట్టకపోవడంతో నష్టపోయాం.

**దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో ఏపీకి 25శాతం వస్తున్నాయి**

సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు చెల్లిస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, దీపం పథకాలు అమలు చేస్తున్నాం. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాం. 150 రోజుల్లోనే 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 6వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించాం. ఇవన్నీ ప్రజలకు వివరించాలి. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో ఏపీకి 25శాతం వస్తున్నాయి. అహర్నిశలు కష్టపడుతున్నాం. ఎంత పని ఒత్తిడి ఉన్నా వారంలో ఒక రోజు పార్టీ కేంద్ర కార్యాలయానికి కేటాయించాం. కార్యకర్తలను కలుస్తున్నాం. వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాం. ప్రతి రోజు ఒక మంత్రి వస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేస్తున్నారు.

**విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ది**

ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ఢిల్లీలో నరేంద్ర మోదీ గారు, ఏపీలో సీఎం చంద్రబాబు గారి నాయకత్వంలో అభివృద్ధి పథాన సాగుతున్నాం. విశాఖ ఉక్కును కాపాడాం. ఈ రోజు విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ది. ఈ అంశంలో వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం. అమరావతి, పోలవరం పనులు కొనసాగుతున్నాయి. కర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తాం. ఇచ్చిన హామీలు పద్ధతి ప్రకారం నిలబెట్టుకుంటున్నాం.

**అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం**

అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు ఇందుకు ఉదాహరణ. 2019 నుంచి 2024 వరకు మనం ఎంతో నష్టపోయాం. పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేశారు. తగ్గేదే లేదని మనం ముందుకు వెళ్లాం. అందరం కష్టపడి ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకున్నాం. చిన్నచిన్న సమస్యలు ఉన్నా మనం అనుకున్న దాని కోసం పోరాడాలి, నాయకులతో చర్చించాలి. పార్టీ నేతలు అలక వీడాలి. అలిగితే నష్టపోయేది మనం, మన పార్టీ, మన రాష్ట్రం. కూటమిలో విడాకులు ఉండవు, మిస్ ఫైర్ లు ఉండవు, క్రాస్ ఫైర్ లు ఉండవు. సమస్యలు ఏవైనా ఉంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. ఇది గ్రామస్థాయి వరకు పాటించాలి. కనీసం 15 ఏళ్లు కలిసికట్టుగా ముందుకు వెళ్తేనే అభివృద్ధి సాధ్యమని పవనన్న చెప్పారు. మన మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తోందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సమయం వృథా చేసుకోకండి

అద్భుతమైన చర్చ జరిగింది" అని రాసుకొచ్చారు. అలాగే ఈ వీడియోను అందరూ చూడాలని సూచించారు. ఈ వీడియోలో మోదీ విద్యార్థులతో మాట్లాడుతూ.. "నేను ప్రధానిని అయ్యాను. కానీ పనితీరు గురించి ప్రజలు ఎన్నో విషయాలు చెప్తుంటారు. ఆ సలహాలు అన్నీ తీసుకోవాలి. కానీ అందులో మనకు సరిపోయేది ఎంచుకోవాలి. నేను కూడా కొన్ని సూచనలు తీసుకొని, పనిలో మార్పులు చేసుకున్నాను. నా విలువలను మాత్రం వదులుకోలేదు. చదువు, విశ్రాంతి, అలవాట్లు, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంలో ఒక బ్యాలెన్స్ ఉండేలా చూసుకోవాలి. అదే ఎదుగుదలకు కీలకంగా మారుతుంది. ఆటలు ఆడటం అనేది ఒక నైపుణ్యం. వాటిని ఒక సరదాగా మాత్రమే చూడకండి. జూదం జోలికి వెళ్లకండి. బెట్టింగ్‌ల వంటి వాటికి వ్యతిరేకంగా మన దేశంలో చట్టాలు ఉన్నాయి. అలాగే గతం దగ్గరే ఆగిపోకుండా.. మీ ముందున్న దాన్ని చూసేందుకు ప్రయత్నించండి. ఇంకా చేయాల్సిన వాటి గురించి ఆలోచించండి. ఇంటర్నెట్ తక్కువ ధరకే లభిస్తుందని సమయం వృథా చేసుకోకండి. పరీక్షలను పండుగలా చేసుకోవాలి.. మీతో మీరు పోటీపడాలి" అంటూ పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరి ఆలోచనా విధానానికి తేడా ఉంటుందని గుజరాత్ విద్యార్థి సాన్య అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ఈసారి పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు 4.5 కోట్ల మంది నమోదయ్యారు.

# వెంటనే ఇరాన్ వీడండి

ఇది కొత్త అడ్వైజరీ కాదంటూ పోస్టులు పెడుతున్నారు. ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొంటున్న ఇరాన్.. స్వదేశంలో జరిగిన భారీ నిరసనల నుంచి ఇంకా పూర్తిగా బయటపడలేదు. అడ్వైజరీకి ముందు ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ మరోసారి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. "ఖమేనీ చాలా కలత చెందక తప్పదు" అని పేర్కొన్నారు. దీంతో అమెరికా దాడులు చేస్తుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు దేశాల మధ్య అణు చర్చలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ ప్రకటనలు రావడం గమనార్హం. ఒమన్‌లో జరగనున్న చర్చల్లో కేవలం అణు అంశాల పైనే కాకుండా, ఇతర విషయాల పైనా సమాలోచనలు జరపాలని ఇరాన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# అపవిత్రం చేసిన మోసగాళ్లు

కల్తీ మందులు సరఫరా చేయడంతో మొదలై.. కల్తీ లిక్కర్, చివరకు సామాన్య ఇసుకలో సముద్రపు ఇసుక కలిపి విక్రయించే స్థాయికి జగన్ పాలన దిగజారిపోయింది. చివరకు విద్యా వ్యవస్థను, పరీక్షా విధానాలను కూడా కల్తీ చేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నారు. ఆ మనిషే ఒక కల్తీ, ఆయన పాలనే ఒక కల్తీ అని మండిపడ్డారు.

# దెబ్బతినకుండా పని చేస్తా

శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో రవిచంద్ర దంపతులకు పండితులు ఆశీర్వచనం అందజేశారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు సేవచేసే అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలి

అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి మాట్లాడుతూ.. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు, స్వర్ణ మండల, స్వర్ణ జిల్లాల ద్వారా 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' సాధించడమే లక్ష్యమని అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం మేరకు 'విజన్ 2047'లో భాగంగా 'స్వర్ణాంధ్ర ప్రదేశ్'ను సాధించడమే లక్ష్యమన్నారు. జిల్లా, మండల స్థాయి అర్బన్ లెవల్ స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులందరులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో వేర్వేరు క్యాడర్‌లలో ఉన్న అధికారులందరికీ నేడు ఇప్పుడు పదోన్నతులు లభించాయని ఆయన పేర్కొన్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది ప్రతి పౌరునికి సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ శాఖల పర్యవేక్షణ వేర్వేరుగా ఉండేదని, అయితే మెరుగైన పర్యవేక్షణ కోసం నేడు వాటిని సమన్వయం చేస్తూ స్వర్ణ గ్రామ సచివాలయాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. గత ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న సుమారు 20,000 పోస్టులతో కలిపి మొత్తం 1,40,000 మంది సిబ్బంది స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ శాఖలో పనిచేస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఏ, బి, సి కేటగిరీలుగా సిబ్బందిని విభజించి (రేషనలైజేషన్) సేవలను క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను బలోపేతం చేస్తూ 10 మంది అదనపు సిబ్బందిని కేటాయించామన్నారు. మండల స్థాయిలో అధికారులకు సహాయంగా ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ ను నియమించామన్నారు. విశాఖపట్నం వంటి మహానగరాల్లో 18 మంది, ఇతర నగర పంచాయతీలలో జనాభాను బట్టి 4 నుండి 10 మంది వరకు సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు. క్లస్టర్ ఆధారిత సేవలను అందిస్తూ, సంబంధిత విభాగాలతో (లైన్ డిపార్ట్‌మెంట్స్) సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గుర్తుచేశారు. స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ సచివాలయ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లా, మండల , పట్టణ స్థాయిల్లో 'స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు' శాఖలో పదోన్నతి పొందిన అధికారులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీ సీబీ అండ్ హెచ్ఆర్ జీవీ సూర్యనారాయణ, ఏడీసీ డీఎస్ ఎస్. గౌతమి, చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ సీహెచ్. చిన్నారావు, ప్రణాళిక శాఖ అధికారి అనంత శంకర్, తదితర అధికారులు ఓరియెంటేషన్ పై ఉద్యోగులకు, అధికారులకు అవగాహన కల్పించారు.

# 30 మందికి పైగా మృతి

పాల్పడింది ఎవరనే విషయం తెలియనప్పటికీ.. తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)తో సంబంధమున్న ఓ విదేశీ పౌరుడు ఈ దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసు అనుమానిస్తున్నారు. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవకత్ మిర్జియేయెవ్ పాకిస్థాన్‌లో పర్యటిస్తున్న సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది.

# ఎడిటర్ వాయిస్

## కూటమి హిందూత్వ అస్త్రం - వర్కౌట్ అవుతుందా?

దేశంలో రాజకీయాలు చూస్తే కనుక ఉత్తరాది దక్షిణాది రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తుంది. ఉత్తరాదిన సున్నితమైన అంశాలు చాలా వరకూ తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అందులో మత పరమైన అంశాలు భావోద్వేగాలు ఎక్కువగా కనిపిస్తాయి. అదే దక్షిణాది రాష్ట్రాలలో చూస్తే వాటి ప్రభావం చాలా తక్కువగా ఉంటుంది. ఇది రాజకీయాల గురించి అవగాహన ఉన్న వారందరికీ తెలిసిన విషయమే. 1990లలో దేశాన్ని కుదిపేసిన అయోధ్య ఇష్యూ కేవలం ఉత్తరాది రాష్ట్రలలోనే తీవ్ర ప్రభావం చూపించింది. ఇక బీజేపీ హిందూత్వ నినాదాలు కూడా ఉత్తర భారతం పరిధి పరిమితి దాటి వినిపించలేదు, వాటి ప్రభావం కూడా అంతగా కనిపించలేదు. ఇది చరిత్ర, ఇది విషయం. కానీ ఏపీలో టీడీపీ కూటమి ఇపుడు సరికొత్తగా పాత అస్త్రాలను ప్రయోగించాలని చూస్తోంది.

హిందూమతం అంటూ : దాదాపుగా సగానికి పైగా మంత్రులతో కూటమి మిత్రులతో చంద్రబాబు ఒక కీలకమైన మీడియా సమావేశాన్ని తాజాగా నిర్వహించారు. అందులో ఆయన ప్రస్తావించిన అంశాలలో లడ్డూ కల్తీ జరిగింది అన్నది ప్రముఖమైనది. ఈ లడ్డూ కల్తీ విషయంలో వైసీపీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి అన్నది ఆయన అంటున్న మాట. వైసీపీ అధినాయకత్వానికి హిందూ మతం మీద విశ్వాసం లేదని కూడా బాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దానికి వైసీపీ పాలనలో జరిగిన అనేక ఆలయాల విధ్వంసం వంటి వాటిని కూడా ఉదహరించారు.

భ్రష్టు పట్టించాలని : అంతే కాదు, హిందూ మతాన్ని భ్రష్టు పట్టించాలని నాటి ప్రభుత్వం ఎన్నో చర్యలను చేపట్టిందని ఒక విధంగా కుట్ర చేసిందని ఘాటైన ఆరోపణలనే బాబు చేశారు. ఇక హిందూ మతం గొప్పదనం గురించి కూడా ఆయన చెప్పుకొచ్చారు మన సంస్కృతి, మన కుటుంబ వ్యవస్థ పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయి, విడాకుల ప్రస్తావన ఉండదు, ఎంతో భద్రత ఉంటుంది అని వివరించారు. ఇవన్నీ పక్కన పెడితే ఆ వెంకటేశ్వరస్వామి వారే తమను ఆలయ పవిత్రత కాపాడాలని ఈ కార్యక్రమాలకు ఎంచుకున్నారని బాబు చెప్పడం విశేషం.

వదిలేది లేదంటూ : తిరుమల స్వామి వారి ప్రసాదాంలో అపచారం చేసిన వారిని వదిలే ప్రసక్తి లేదని బాబు గట్టిగానే హెచ్చరించారు. ఈ విషయంలో కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అంతే కాదు అన్ని వివరాలూ పూర్తి సమాచారం ప్రజలా ముందు ఉంచుతామని అంటున్నారు. ఒక చట్టపరంగా చూస్తే ఏక సభ్య కమిషన్ ని వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరి రాజకీయ పరంగా చూస్తే హిందూత్వ నినాదాన్ని బలంగా జనంలోకి తీసుకుని వెళ్ళి వైసీపీని గట్టిగానే ఇరికించాలని వ్యూహం ఉంది అన్న విశ్లేషణలు ఉన్నాయి.

బీజేపీ వల్ల కానిది : నిజానికి తెలుగు రాష్ట్రాలలో అందునా ఏపీ వంటి చోట హిందూత్వ నినాదాలు ఎంతవరకూ వర్కౌట్ అవుతాయని అంటే సందేహమే సమాధానం అవుతుంది. హిందూత్వను రగిలించాలని బీజేపీ గతంలో ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ అవి పెద్దగా ముందుకు సాగలేదు, ఏపీలో చూస్తే కులాల సమాహారంగా ఉంటుంది. రాజకీయాల్లో కులాల పాత్ర ఎక్కువ. ఆ ఈక్వేషన్స్ బాగా పండుతాయి కానీ మతపరమైన అంశాల పట్ల జనం అప్రమత్తగా ఉంటారు, జాగరూకతతోనే వ్యవహరిస్తారు. తిరుమల దేవుడు అంటే అందరికీ అచంచలమైన విశ్వాసం ఉంది. అదే సమయంలో దానికి రాజకీయాలకు ముడిపెడితే జనమంతా ఒకే వైపుగా పోలరైజ్ అవుతారు అన్న దానికి కూడా అవకాశాలు పెద్దగా లేవనే గత చరిత్ర చెబుతోంది.

అంతవరకే ఆగితేనే : తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో కల్తీ జరిగింది అని తేలింది అని చెబుతున్నారు అలాగే ఏక సభ్య కమిషన్ వేసి తెర వెనక వారిని తెర ముందుకు తెస్తామని అంటున్నారు. అయితే చట్టపరంగా వీటి మీద చర్యలు తీసుకుని దానిని అక్కడితే ముగిస్తేనే మేలు అన్న మాట ఉంది. అలా కాకుండా ఇందులో హిందూత్వను జొప్పిస్తే కనుక అది ఏ మేరకు ఫలితాలు ఇస్తుంది అన్నదే చర్చగా ఉంది.




ఏది ఏమైనా బీజేపీ వల్ల కానిది బలమైన పార్టీ యంత్రాంగం ఉన్న టీడీపీ హిందూత్వతో ముందుకు సాగితే ఏమైనా రిజల్ట్ ఉంటుందా అన్నది చూడాలి. ఒక్కటి మాత్రం నిజం రాజకీయాలు వేరు మతం వేరు, రెండింటినీ ముడి పెడితే మాత్రం దక్షిణాదిన అది చెల్లదని గత చరిత్ర అయితే స్పష్టంగా నిరూపించింది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

విదేశాలకు పారిపోవచ్చు..

## ఐ-బొమ్మ రవికి బెయిల్ ఇవ్వొద్దు : పీపీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐ-బొమ్మ రవి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. మూడు నెలల నుంచి రవి జైలులోనే ఉన్నారని, ఇప్పటికే విచారణ కూడా పూర్తయిందని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణకు సహకరించడానికి ఇమంది రవి సిద్ధంగా ఉన్నారని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. రవికి కరేబియన్ దీవుల పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే అక్కడి వెళ్లిపోయే అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు వాదించారు. ఐబొమ్మ వెబ్‌సైట్‌కు సంబంధించి ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి ఇప్పటికీ ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయని.. పోలీసులు వాటిపై దర్యాప్తు చేయాల్సి ఉందని పీపీ తెలిపారు. పోలీసులు.. పిటిషనర్ పాస్ పోర్టును ఇప్పటికే సీజ్ చేశారని, ఈ తరుణంలో ఆయన ఎలా విదేశాలకు పారిపోతాడని రవి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇమంది రవి పాస్ పోర్టు సీజే చేశారో లేదో తెలపాలంటూ పీపీని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

చదివింది న్యాయ విద్య..

## చేసేది ల్యాప్‌టాప్‌ల చోరీ



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** న్యాయ విద్యను అభ్యసించి.. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని గుంటూరు జిల్లా మంగళగిరి పోలీసులు అరెస్టు చేశారు. 11 రాష్ట్రాల్లో 61 ల్యాప్‌టాప్‌లు చోరీ చేశాడని పోలీసులు తెలిపారు. డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ బ్రహ్మం గురువారం వివరాలు వెల్లడించారు. తమిళనాడు తిరువారూర్ జిల్లాకు చెందిన పతమిళ్ సెల్వన్ వర్సిటీల్లో ప్రవేశాల కోసం వచ్చినట్లు నటించి, రెక్కీ చేస్తాడు. ఆ తర్వాత అనుకూలంగా ఉన్న వసతిగృహాన్ని అడ్డాగా చేసుకొని, ల్యాప్‌టాప్‌లను చోరీ చేస్తాడు. ఈ క్రమంలో రాజధాని ప్రాంతంలోని కురగల్లు, నీరుకొండలోని అమృత విద్యాపీఠం, ఎస్ఆర్ఎం వర్సిటీల్లో డిసెంబరు 31న ల్యాప్‌టాప్‌లు చోరీ చేశాడు. వార్డెన్లు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి నిందితుడి ఆనవాళ్లు గుర్తించారు. సాంకేతికతతో ఆచూకీ కనుగొని, మంగళగిరి మండలం ఎర్రబాలెం డాన్‌బాస్కో వద్ద ఈనెల 2న అరెస్టు చేశారు. అతని నుంచి రూ.12 లక్షల విలువైన 15 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. చెన్నై, గోవాల్లోని విద్యాసంస్థల్లోనూ చోరీలకు పాల్పడ్డట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగస్వాములైన అధికారులు, సిబ్బందిని డీఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

సీఐ, కానిస్టేబుల్‌పై కత్తితో

## దాడి చేసిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్

**హిందూపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన సీఐ, కానిస్టేబుల్‌పై హత్యాయత్నం జరిగింది. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవిపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ నాగేంద్ర కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఆత్మరక్షణలో భాగంగా నిందితుడి కాలిపై సీఐ కాల్పులు జరిపారు. దీంతో అతడికి గాయాలయ్యాయి. చిలమత్తూరు మండలం ఎర్రకొండ అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన సీఐ, కానిస్టేబుల్‌తో పాటు నిందితుడిని హిందూపురంలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అత్త, కోడలిపై గ్యాంగ్ రేప్ కేసులో నాగేంద్ర ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో పట్టుకునేందుకు హిందూపురం, చిలమత్తూరు పోలీసులు వెళ్లగా.. వారిపై అతడు తిరగబడ్డాడు. నిందితుడిపై తెలుగు రాష్ట్రాల్లో 90కి పైగా కేసులు నమోదయ్యాయి.

## జూబ్లీహిల్స్‌లో ఘరానా చోరీ..

మత్తు మందు ఇచ్చి..

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని జూబ్లీహిల్స్‌లో ఘరానా చోరీ జరిగింది. నేపాలీ ముఠా.. ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ సహా పని మనుషులకు మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చి చోరీకి పాల్పడింది. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగిరిహిల్స్‌లోని ఓ ఇంట్లో నేపాల్‌కు చెందిన భువన్ అనే వ్యక్తి 15 రోజుల క్రితం వంటమనిషిగా చేరాడు. తన పుట్టినరోజు అంటూ వాచ్‌మెన్ సహా అక్కడి పనివారికి భువన్ మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చాడు. అందరూ అపస్మారక స్థితిలోకి వెళ్లాక మరో ముగ్గురు నేపాలీలతో కలిసి భువన్ చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ పథకం అమలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

హెటిరో పరిశ్రమ కార్యాలయంలో కూలిన శ్లాబ్..

## అసిస్టెంట్ మేనేజర్ మృతి



**నక్కపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని హెటిరో పరిశ్రమ కార్యాలయంలో ఘోర ప్రమాదం జరిగింది. శ్లాబు పెచ్చులూడి పడి అసిస్టెంట్ మేనేజర్ మృతి చెందగా, సీనియర్ మేనేజర్ తీవ్రంగా గాయపడ్డారు. నక్కపల్లి సీఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. పారిశ్రామిక వాడలో హెటిరో ల్యాబ్స్ యూనిట్-3 భవనంలో కార్యాలయం ఉంది. గుంటూరుకు చెందిన సీనియర్ మేనేజర్ షేక్ మస్తాన్ వలీ, నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన అసిస్టెంట్ మేనేజర్ బి.చిరంజీవి శుక్రవారం విధుల్లో ఉన్నారు. కార్యాలయంలో ఉన్న సమయంలో ఒక్కసారిగా శ్లాబు పెచ్చులూడి పడ్డాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ కంపెనీ ప్రతినిధులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ చిరంజీవి మృతి చెందారు. మస్తాన్ వలీని మెరుగైన వైద్యం కోసం అపోలో ఆసుపత్రికి తరలించారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**నేరడిగొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బుగ్గారం(బి) గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాదవ్ గంగాధర్(58) వానకాలం సీజన్‌లో తనకున్న మూడెకరాల పొలంలో పత్తి సాగు చేశారు. అధిక వర్షాలతో పంట తీవ్రంగా దెబ్బతిని దిగుబడి రాలేదు. దీంతో బయట చేసిన అప్పులు, బ్యాంకు రుణం మొత్తం రూ.5 లక్షలు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. గంగాధర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# భక్తి వాయిస్

## అరుణాచల మహాత్మ్యం- ఒక్కసారి దర్శిస్తే చాలు వివాహం, సంతానం గ్యారెంటీ!

ఈ క్షేత్రాలను ఒక్కసారి దర్శిస్తే వివాహం, సంతాన దోషాలు, మృత్యుభయం, ఆర్థిక ఇబ్బందులు వంటి అనేక సమస్యల నుంచి ఉపశమనం! పంచభూత లింగాలలో అగ్నిలింగంగా భాసిల్లుతున్న అరుణాచల క్షేత్రం తమిళనాడులో తిరువణ్ణామలైలో ఉంది. అరుణ అంటే ఎర్రని, చలం అంటే కొండ అని అర్థం. అరుణాచలం కొండ అగ్ని రూపంలో సాక్షాత్కరించిన శివ స్వరూపం. అందుకే అరుణాచలంలో గర్భాలయంలోని శివుని దర్శనం కన్నా అరుణాచలం కొండకు చేసే గిరి ప్రదక్షిణకే ప్రాధాన్యత ఎక్కువ. అరుణాచలంలో ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. పౌర్ణమి రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపవుతుంది. అయితే అరుణాచలం గిరి ప్రదక్షిణ వలయంలో తప్పకుండా దర్శించ వలసిన 44 అతి శక్తి వంతమైన ఆలయాలు గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.స్మరణతోనే పుణ్యం తమిళ భక్తులు అన్నామలై గా పిలుచుకునే అరుణాచలం క్షేత్రం పేరు స్మరించినంతనే సకల పాప దోషాలు తొలగిపోయి పుణ్యం లభిస్తుందని విశ్వాసం. ఈ అరుణాచల స్వామి తేజోలింగం, జ్యోతిర్లింగం. అందుకే ఈ క్షేత్రాన్ని అగ్ని క్షేత్రమని కూడా కొనియాడతారు. 14 కి. మీ. ఉన్న అరుణగిరి ప్రదక్షిణ చేయడమంటే సాక్షాత్తు ముక్కంటికి ప్రదక్షిణ చేసినట్లే అని పురాణాలు చెబుతున్నాయి. వేదాలు, ఉపనిషత్తులలో అరుణాచలం కొండ సాక్షాత్తు ఆ మహేశ్వరుడని సెలవిస్తోంది. ఇక ఈ గిరిప్రదక్షిణ చేసే మార్గంలో 44 చిన్న చిన్న ఆలయాలు దర్శించుకుని ప్రధాన ఆలయం దగ్గరకు చేరుకుంటే గిరిప్రదక్షిణ పూర్తైనట్టే! గిరి ప్రదక్షిణ మార్గంలో చూడవలసిన ఆలయాల వివరాలు ఇప్పుడు చూద్దాం.

**బ్రహ్మలింగం:** అరుణాచలం గిరి ప్రదిక్షిణ ప్రారంభించాల్సిన ప్రదేశం ఇది. ఇక్కడ ముందుగా వినాయకునికి నమస్కరించుకుని గిరి ప్రదక్షిణ మొదలు పెట్టాలి.

**ఇంద్ర లింగం:** ఇది ఇంద్రుడు ప్రతిష్టించిన శివలింగం. దీనికి శుక్రుడు, సూర్యుడు అధిదేవతలు. ఈ లింగాన్ని దర్శించుకుంటే వృత్తి ఉద్యోగ వ్యాపారాలకు సంబంధించిన సమస్యలు తొలగిపోతాయి.

**అగ్నిలింగం - అగ్ని తీర్థం :** అరుణగిరి చుట్టూ మొత్తం 8 శివలింగాలున్నాయి.. వాటిలో ఏడు రోడ్డుకి ఎడమవైపు ఉంటే అగ్నిలింగం మాత్రం కుడివైపుకు ఉంటుంది. దీనినే అగ్ని తీర్థం అని కూడా అంటారు. ఇక్కడ స్వామి వారిని దర్శించుకుంటే కష్టకాలంలో ప్రమాదాల నుంచి గట్టెక్కిస్తాడని నమ్మకం.

**శేషాద్రి స్వామి :** శేషాద్రి స్వామి అరుణాచలంలో చిరకాలం నివసించి ముక్తిని పొందారు. ఈయన ఆశ్రమంలోని సమాధి దర్శనంతో సానుకూల శక్తులు పెరుగుతాయని విశ్వాసం.

**దక్షిణా మూర్తి:** శివుని యొక్క జ్ఞాన స్వరూపం దక్షిణామూర్తి. అరుణగిరి ప్రదక్షిణ వలయంలో ఉన్న అతి పురాతనమైన, శక్తివంతమైన దక్షిణామూర్తి ఆలయం తప్పకుండా దర్శించాలి.

**రమణాశ్రమం:** రమణమహర్షి ఆశ్రమంలో చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి.

**మీనాక్షీ, సుందరేశ్వరుడు, గణేశ ఆలయాలు:** పార్వతీ పరమేశ్వరుల శక్తి ఇక్కడ భక్తుల విశ్వాసం.

**ద్రౌపది ఆలయం:** గిరి ప్రదక్షిణ వలయంలో ఉన్న ద్రౌపది ఆలయం నుంచి గిరి దర్శనం అద్భుతంగా ఉంటుంది. జీవితంలో ఎదురుదెబ్బలు తిని విసిగిపోయిన వారికి ఈ ఆలయ దర్శనం మానసిక స్థైర్యాన్నిస్తుంది.

**యమలింగం:** యముడు పూజించిన ఈ శివలింగాన్ని దర్శించుకుంటే అకాలమృత్యువు దరిచేరదు. మృత్యుభయం తొలగిపోతుంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**పృథ్విలింగం:** అరుణాచలం గిరిచుట్టూ ఉన్న 8 శివలింగాల్లో ఇదొకటి.

**గణపతి:** తొండం కుడివైపు తిరిగిఉండే ఈ గణపయ్యను దర్శించుకుంటే అదృష్టం వరిస్తుంది.



**దూర్వాస ఆలయం:** ఇక్కడ దూర్వాసుడిని కుంతీ దేవి ప్రతిష్ఠించిందని చెబుతారు. ఇక్కడున్న వేప చెట్టుకి పసుపు దారాలు కడితే సంతాన భాగ్యం కలుగుతుందని, రాళ్లు పేరిస్తే ఇల్లు కట్టుకుంటారని భక్తుల విశ్వాసం.

**కాట్టు శివాశ్రమం:** గిరి ప్రదక్షిణలో భాగంగా ఈ ఆశ్రమాన్ని రోడ్డుపై నుంచి దర్శనం చేసుకుని వెళ్ళిపోవచ్చు.

**అప్పు నంది:** ఈ నంది దర్శనం కుటుంబ వివాదాలను సమసిపోయేలా చేసి బంధాలను వృద్ధి చేస్తుంది.

**తేయునంది:** ఈ నంది నుంచి చూస్తే గిరి చతుర్ముఖ దర్శనం ఉంటుంది. బ్రహ్మదేవుడు జీవుల సృష్టికి కావాల్సిన జ్ఞానం ఇక్కడి నుంచి పొందారని చెబుతారు.

**శోణ తీర్థం:** ఇక్కడ రెండు నందులుంటాయి. ఇక్కడున్న వినాయకుడిని జ్యోతి వినాయకుడు అంటారు. రమణ మహర్షి గిరి ప్రదక్షిణ చేసేటప్పుడు సేదతీరిన ప్రదేశం ఇది.

**నైరుతి లింగం:** గిరి ప్రదక్షిణలో ఉన్న అష్ట లింగాల్లో నాలుగోది ఇది. ఇక్కడ స్వామిని దర్శించుకుంటే రుణ, గ్రహ బాధలు తొలగిపోయి కీర్తి ప్రతిష్టలు వస్తాయి.

**నంది ముఖ దర్శనం:** ఇక్కడి నుంచి అరుణ గిరివైపు చూస్తే నంది ముఖంలా కనిపిస్తుంది.

**ఎదిర్ నేర్ అన్నామలై:** ఇది అరుణ గిరికి సరిగ్గా వెనుకవైపు ఉంటుంది. ఇక్కడి నుంచి గిరిని చూస్తే శివశక్తి దర్శనం అవుతుంది. అంటే శివుడు ఓ కొండగా, శక్తి మరో కొండగా కనిపిస్తారు.

**ఆకాశ నంది:** పంచభూతాల్లో భాగంగా ఉండే నందుల్లో నాలుగోది ఆకాశనంది.

**పళని ఆండవార్ ఆలయం:** కుమార స్వామి ఇక్కడ తపస్సుచేసి స్వయంభువుగా వెలిశాడని చెబుతారు. అందుకే ఈ ప్రదేశం అత్యంత శక్తివంతమైనది విశ్వాసం.

**రాజ రాజేశ్వరి ఆలయం:** ఇది చిన్న ఆలయమే కానీ మహాశక్తివంతమైన ఆలయం. తప్పకుండా దర్శించుకోవాలి.

**సింహ తీర్థం, సింహ నంది:** పంచభూత నందుల్లో ఇది ఐదోది. ఇక్కడున్న సింహ తీర్థంలో నీరు తాగితే ఎంతటి వ్యసనం అయినా మానేయగలుగుతారు.

**కన్నప్ప గుడి:** అటవీశాఖ అధీనంలో ఉన్నందున ఈ గుడికి రోడ్డుపై నుంచి మాత్రమే నమస్కారం చేసుకోవాల్సి ఉంటుంది.

**గౌతమ ఆశ్రమం:** గౌతమ మహర్షి తపస్సు చేసిన పుణ్య ప్రదేశం ఇది.

**సూర్య లింగం:** అరుణగిరిపై నుంచి వెళ్లిన సూర్యుడు తేజస్సు కోల్పోయి ఇక్కడ తపస్సు చేసి మళ్లీ తేజస్సు పొందాడని చెబుతారు. ఇక్కడ ఆదిత్య హృదయం చదువుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్య అయినా పరిష్కారం అవుతుంది.

**వరుణ లింగం:** ఈ వరుణ లింగానికి గ్రహదోషాలు తొలగించే శక్తి ఉంది.

**మాణిక్య వాచకర్ ఆలయం:** మాణిక్యవాచకర్ గొప్ప శివభక్తుడు. ఈయన శివుని కీర్తిస్తుంటే పరమేశ్వరుడు ఆ శ్లోకాలను రచించి భద్రపరిచాడని చెబుతారు.

**ఆది అన్నామలై:** బ్రహ్మదేవుడు ప్రతిష్టించిన ఈ శివలింగం అరుణాచలేశ్వరుడి కన్నా ముందు నుంచే ఉండేదంట!

**వాయులింగం:** ఈ ఆలయంలో కొంతసేపు కూర్చుంటే బయట ఎండగా ఉన్నా లోపల చల్లగా ఉంటుంది.

**వాయు నంది** : వాయునంది చాలా శక్తివంతమైనది.

**భగవాన్ బ్రిడ్జ్:** రమణ మహర్షి సేదతీరిన ప్రదేశం ఇది.

**చంద్ర లింగం:** చంద్రుడు ప్రతిష్టించిన శివలింగం ఇది. దీనిని దర్శించుకుంటే జీవితంలో ఉండే కష్టనష్టాలు, బాధలు తొలగిపోతాయని విశ్వాసం.

**అధికార నంది:** శ్రీశైలంలో సాక్షి గణపతిలా అరుణాచలంలో అధికారి నంది ఉంటుంది. ఈ నంది చెవిలో గోత్రనామాలు చెప్పుకోవాలి.

**అగస్త్య ఆశ్రమం:** ఇక్కడి నుంచి అరుణాచలం కొండను చూస్తే శివపార్వతులు ఇద్దరూ కలసి కనిపిస్తారు. ఇక్కడ దర్శనం చేసుకుంటే వివాహం, సంతాన దోషాలు తొలగిపోతాయి

**కుబేర లింగం:** లక్ష్మీదేవి ఈ లింగాన్ని ఆరాధించి కుబేరుడికి అప్పగించింది. ఇక్కడ శివయ్యను దర్శించుకుంటే భోగభాగ్యాలు కలుగుతాయి.

**ఇడుక్కు పిళ్లయార్:** చూడటానికి చాలా చిన్నగా కనిపించే ఇది ఆలయం కాదు. లోపల రెండు యంత్రాలు అమర్చారని, గిరిప్రదిక్షిణ వల్ల వచ్చిన అలసట ఈ ప్రదేశం మాయం చేసేస్తుందని నమ్మకం.

**పంచముఖ దర్శనం:** ఇక్కడి నుంచి అరుణ గిరిని చూస్తే ఐదు ముఖాలుగా కనిపిస్తుంది. ఈ ప్రదేశం వృత్తి ఉద్యోగాల్లో ఉన్నతిని కలిగిస్తుంది.

**ఊసి లింగం:** 'ఊసి' అంటే తమిళంలో సూది అని అర్థం. ఇక్కడ శివలింగం సూది ఆకారంలో ఉంటుంది.

**పచ్చయ్యమ్మ గుడి:** ఇక్కడ శ్యామలాదేవి పచ్చయ్యమ్మన్ స్వరూపంలో కొలువైంది.

**ఈశాన్య లింగం - యజమాన నంది:** ఈశాన్య లింగం దర్శనంతో అష్టదిక్పాలకుల లింగాల దర్శనం పూర్తవుతుంది.

**షణ్ముఖ ఆలయం:** ఇక్కడ సుబ్రహ్మణ్య స్వామివారు ఆరుముఖాల్లో దర్శనమిస్తాడు.

**దుర్గాలయం - ఖడ్గ తీర్థం:** ఇక్కడ అమ్మవారు మహిషాసురుడిని సంహరించాడని చెబుతారు.


**ప్రవాళ పర్వతం:** అరుణ గిరిప్రదిక్షిణలో ఆఖరి ప్రదేశం ఇది. రమణ మహర్షి తన తల్లికి ఉపదేశం చేసిన ప్రదేశం ఇది.

అరుణాచలంలో నిత్యమూ అన్నివేళలా ఎంతమంది గిరి ప్రదక్షిణ చేస్తూ ఉంటారు. గిరిపైన గల మహౌషధీ ప్రభావం వల్ల శరీరమునకు, శివనామ స్మరణవల్ల మనస్సుకు, శివానుగ్రహం వల్ల ఆధ్యాత్మిక జీవనానికి స్వస్థత చేకూరుతుందని విశ్వాసం. అయితే గిరి ప్రదక్షిణ హడావుడిగా ఏదో మొక్కుబడిగా కాకుండా మొత్తం 44 దర్శనీయ స్థలాలు దర్శిస్తూ ప్రదక్షిణ చేసినప్పుడు మాత్రమే గిరి ప్రదక్షిణ ఫలం పూర్తిగా దక్కుతుంది.

**ఓం శ్రీ అరుణాచలేశ్వరాయ నమః**

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం, 07 ఫిబ్రవరి 2026



# రాయవరంలో ముగిసిన పెద్ద పులి ప్రయాణం

**అభయారణ్యం టు జనారణ్యం సాగిన పెద్దపులి యాత్ర - సుమారు 650 కిలోమీటర్ల ప్రయాణం, రోజుకో ప్రాంతంలో సర్వైజ్ ఎట్టకేలకు కూర్మాపురంలో బంధించిన అధికారులు - రోజంతా చెమటోడ్చిన అధికారులు, ఊపిరి పీల్చుకున్న ప్రజలు.... ఫలించిన అటవీ, పోలీస్ శాఖ, రెస్క్యూ బృందాల కృషి....**





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గత కొన్ని రోజులుగా జిల్లాలో అధికార యంత్రాంగంతో పాటు పలు గ్రామాల ప్రజలను బెంబెలెత్తించిన పెద్దపులి ఎట్టకేలకు శుక్రవారం పోలీస్, అటవీశాఖ అధికారుల సమన్వయంతో బంధించారు. మహారాష్ట్ర లోని తడోబా పులుల అభయారణ్యం నుండి సుమారు 650 కిలోమీటర్ల సుదూర ప్రయాణం సాగించిన పెద్ద పులి పలు ప్రాంతాలతో పాటు గోదావరిని సైతం దాటుకుని తూర్పుగోదావరి జిల్లా లో ప్రవేశింపగా రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో రహదారి వెంట సంచరించడంతో యువకులు వీడియో చిత్రీకరించడంతో వైరల్ గా మారగా, రాజానగరం మండలం నుండి మండపేట నియోజకవర్గం మండపేట మండలం లోని వేములపల్లి, కేశవరం, ద్వారపూడి ప్రాంతాల్లో పులి సంచరించినట్లు అటవీశాఖ, పోలీస్ శాఖ అధికారులు అధికారికంగా ధ్రువీకరించారు. గురువారం నుంచి ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుందన్న వార్త ప్రజల్లో కునుకు లేకుండా చేయడంతో పాఠశాలలకు సైతం అధికారులు శెలవులు ప్రకటించారు. అధికారులంతా మండపేట మండలంలో పులిని పట్టుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టగా, పెద్దపులి అక్కడ నుంచి తప్పించుకుని రాత్రికిరాత్రే సుమారు 50 కిలో మీటర్ల దూరం ప్రయాణించి అసలు ఊహించని ప్రాంతమైన రాయవరం మండలం, కూర్మాపురం గ్రామంలో శుక్రవారం ఉదయం ఒక పాత పెంకుటిల్లులో పులి గాండ్రింపులు వినిపించడంతో ఉలిక్కిపడిన ఉన్నట్టు అక్కడి స్థానికులు గుర్తించారు. వెంటనే సమాచారం అందుకున్న జిల్లా అటవీ శాఖ, తూర్పుగోదావరి జిల్లా పోలీసులు రెస్క్యూ టీం తో అక్కడికి హుటాహుటిన చేరుకున్నారు. డ్రోన్ కెమెరాతో పులిజాడను గుర్తించి చర్యలకు సిద్ధమవగా, ఈలోగా ఆ భవనం నుంచి పులి వేగంగా బయటకు వచ్చి వరి పంటచేలలో అటు ఇటు పరుగులు తీస్తూ సంచరించగా పులిని చూడడానికి పలు ప్రాంతాల నుండి వచ్చిన అనేకులు పులిని చూసి బయోత్సాహాలతో తమ చరవాణిలలో వీడియో దృశ్యాలు తీస్తూ కేకలు వేస్తూ, పెద్ద ఎత్తున అహకారాలు చేశారు. ఉదయం సమాచారం అందుకున్న రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అక్కడికి వెళ్లి పరిస్థితి సమీక్షించి, అధికారులకు సహకరించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేసారు. ఈ నేపథ్యంలో కొంత దూరం ప్రయాణం చేసిన పులి తిరిగి దిశను మార్చుకుని కూర్మాపురంలోని ఒక తాటాకు పాకలోకి చేరి చాలా సేపు అక్కడే నక్కింది. ఈ పరిణామం తో పాక లో ఉన్న లేక దూడను తింటూ కూర్చున్నట్లు గమనించిన అధికారులు ఆ పాక చుట్టూ వల ఏర్పాటు చేసి, సాహస కార్యకలాపాలు జరిగిస్తూ తాటాకు పాక పైకి ఎక్కి మత్తు ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించక పోగా, ఈ అలికిడి తో పాక నుంచి బయటకు పెద్ద పులి పరుగులు తీయగా అప్పటికే సిద్ధంగా ఉన్న సిబ్బంది వెంటనే మత్తు ఇంజక్షన్లు ఇచ్చారు. దీంతో కొంత దూరం పరిగెత్తిన పెద్దపులి ఒకచోట మత్తుగా పడిపోగా, పోలీస్,అటవీ శాఖ, రెస్క్యూ టీమ్ పులి వద్దకు వెళ్లి చాకచక్యంగా బంధించి బోనులో ఎక్కించారు. ఇక్కడి నుండి సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు. పెద్దపులి ని బంధించే ప్రయత్నం లో పోలీస్, అటవీశాఖ, రెస్క్యూ టీం అధికారులు ఉదయం నుంచి తీవ్రంగా కృషి చేశారు. గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పులి సంచరిస్తుందనే సమాచారంతో ఆందోళన చెందిన ప్రజలు, పులి పట్టుబడటం తో ఊపిరి పీల్చుకోగా అభయారణ్యం నుండి జనారణ్యంలోకి పెద్ద పులి చేపట్టిన యాత్ర కూర్మాపురం లో ముగిసిందని పలువురు చమత్కరిస్తున్నారు.

### ఈహెచ్ఎస్‌లో పెన్షనర్లకూ

# స్థానం కల్పించాలి

**ప్రభుత్వ కార్యదర్శికి వినతి పత్రాన్ని పంపిన ధర్మరాజు**



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉద్యోగుల వైద్యసేవలు (ఈ హెచ్ఎస్)కు అంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసినందుకు కూటమి ప్రభుత్వంకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం (ఏపిఎస్జి ఆర్ఈఏ) ధవళేశ్వరం యూనిట్ అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు దన్యవాదములు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు నాలుగు లక్షల మంది విశ్రాంత ప్రభుత్వోద్యోగులు ఉన్నారని మేమంతా రాష్ట్ర జెఏసికి అనుబంధంగా ఉండి పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని, ఈఎచ్ ఎస్ లో మాకూ ప్రాతినిధ్యం కల్పిస్తే మా నాయకులకు మా సమస్యలు తెలియజేసుకుని పరిష్కారించే వీలుంటుంది, కావున ఈ హెచ్ ఎస్ కమిటీలో మా పెన్షనర్లకు ప్రాతినిధ్యం కల్పించాలని యర్రమోతు ధర్మరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ ద్వారా వినతిపత్రం పంపారు.

# జగన్ పరామర్శ యాత్రలో ఇద్దరు మృతి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా అధినేత జగన్ పర్యటన సందర్భంగా అపశ్రుతి చోటు చేసుంది. మాజీ మంత్రి జోగి రమేష్‌ను పరామర్శించేందుకు తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నం బయల్దేరారు. ఈ క్రమంలో జోగి రమేష్ ఇంటి సమీపంలో వైకాపా నేత ఒకరు మృతి చెందారు. జగన్ పర్యటన దృష్ట్యా జోగి రమేష్ ఇంటికి వెళ్తున్న వైకాపా చిల్లకల్లు గ్రామ అధ్యక్షుడు డి.రాంబాబు పల్స్ పడిపోయి కుప్పకూలారు. సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఇబ్రహీంపట్నంలో బైక్‌పై స్టంట్ చేస్తూ రోడ్డుపై బార్ గేట్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. మృతుడు ఇబ్రహీంపట్నం కొత్తగేట్‌కు చెందిన భార్గవ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ప్రోటోకాల్ పాటించాల్సిందే..

**కోట్లాది మున్సిపల్ నిధులతో అభివృద్ధి**

**తాము పడ్డ కష్టానికి గౌరవం ఇవ్వమని అడిగాం : చైర్ పర్సన్ రాణి**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కోట్లాది రూపాయలు మున్సిపల్ నిధులు తో ఈ ఐదేళ్లు తన పాలన లో మండపేట నుఅభివృద్ధి చేశామని చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. తనపై టిడిపి కౌన్సిలర్ లు చేసిన వ్యాఖ్యలని ఖండించారు. ఏ ప్రభుత్వం అధికారం లో ఉన్నా ప్రోటోకాల్ పాటించాల్సిందేనని చెప్పారు.తాము పడ్డ కష్టానికి గౌరవం ఇవ్వమని అడిగామన్నారు.మొత్తం ఈ కౌన్సిలర్ పేర్లు తో శిలా ఫలకం ఏర్పాట్లు చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రోటోకాల్ అంటే జోగేశ్వరరావు,జోగేశ్వరరావు అంటే ప్రోటోకాల్ అని చెప్తున్నారనీ దాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల ఎందుకు విస్మరించారో చెప్పాలని ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలు తెలుసుకొని మాట్లాడలాని అంటున్నారనీ ముందు వాటి కోసం మాట్లాడేవారే తెలుసుకొని మాట్లాడలన్నారు.తాను సాధారణ గృహిణి నుండి అనుకోకుండా రాజకీయాల్లో కి వచ్చానని, చట్టాలపై సరైన అవగాహన తెచ్చుకునేలోపే పదవి కాలం ముగిసిపోతుందని మొన్న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించానన్నారు. విలువైన మున్సిపల్ స్థలంలో నిర్మాణం చేపట్టినప్పుడు చైర్ పర్సన్ పేరు కు ప్రాధాన్యత నివ్వడం అనివార్యమన్నారు.ఆది నుండి తనకు రాజకీయం కొత్త కావడంతో ప్రోటోకాల్ విషయంలో అన్యాయం జరిగిందన్నారు. గత వైసిపి హయాంలో వారికి ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగితే ఎందుకు కలెక్టర్ కు ఫిర్యాదు చేయలేదన్నారు. ప్రోటోకాల్ పాటించే వ్యక్తి ఇపుడు పాటించలేదనే అడుగుతున్నానన్నారు.టిడిపి హయాంలో రైతు బజార్ వద్ద నిర్మించిన బాత్రూమ్ లకే మాజీ చైర్మన్ చైర్ పర్సన్ చుంద్రు శ్రీ వర ప్రకాష్ పేరు పెద్ద పెద్ద అక్షరాలతో వేశారన్నారు. మరి తను ఒక మహిళా అనే కదా లోకువ చేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం లోను,ఇప్పుడు ఈ ప్రభుత్వం లోను అవమానానికి గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ల లో ఎక్కడైనా ప్రోటోకాల్ కు విరుద్ధంగా శిలాఫలకాలు గుర్తించినట్లయితే కలెక్టర్ కు పిర్యాదు చేసి అన్ని మార్చుకోవచ్చని సవాల్ విసిరారు.తనకేమీ అభ్యంతరం లేదన్నారు.తమ ప్రభుత్వం అధికారంలో ఉండగా తానెక్కడ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును రాజకీయంగా విభేదించానే తప్ప వ్యక్తిగత విమర్శలు ఎక్కడ చేయలేదన్నారు.పెద్ద పెద్ద వాళ్లు ఏమైనా మాట్లాడుకుంటే తనకు సంబంధం లేదన్నారు.ఎమ్మెల్యే వేగుళ్ళను తండ్రిలా బావిస్తానని, ఆయన కూడా తన్ను కూతురులాంటిదాన్నని అందరికి చెప్తుంటారన్నారు.దానికి తాను సంతోషం వ్యక్తం చేస్తున్నానన్నారు. ప్రోటోకాల్ పాటించకపోతే సహించేది లేదన్నారు.మున్సిపల్ చైర్ పర్సన్ గా దాదాపు రూ 35 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు.సబ్ స్టేషన్ కు స్థలం,నిధులు కౌన్సిల్ సభ్యులు అందరూ కలిసి ఆమోదించామని చెప్పనన్నారు.పట్టణ ప్రథమ పౌరురాలిగా తనకు ప్రాధాన్యత ఇవ్వాలని అడిగానన్నారు.లేదంటే మొత్తం కౌన్సిలర్లు పేర్లు తో శిలా ఫలకం ఏర్పాటు చేయాలన్నారు.తానకు ఈ పదవిలోకి అంత సులువుగా రాలేదన్నారు.కరోనా సమయంలో ఎంతో కష్టపడి తిరిగానన్నారు.కరోనా సోకిన చికిత్స అనంతరం మరల వార్డుల్లో పర్యటించి ప్రజలకు సహాయకారిగా ఉన్నానని గుర్తు చేశారు.ఆ కష్టాన్ని చూసే ప్రజలు తన్ను గెలిపించారని తెలిపారు. తాను ఎక్కడ రాజకీయాలు చెయ్యట్లేదని ఒక మహిళగా తగిన గౌరవం దక్కాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.చట్టపరంగా తన గౌరవం తనకు దక్కి తీరలసిందేనని స్పష్టం చేశారు.చట్టాలను ముందు టిడిపి కౌన్సిలర్ లు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. మహిళ అంటే వారికి అంత చులకనగా ఉందనీ ఆవేదన వ్యక్తం చేశారు.సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ ఎందుకు విస్మయించరో తెలియదన్నారు. సుమారు 20 సంవత్సరాల పాటు గృహిణిగా ఇంట్లోనే ఉండి మొదటిసారి రాజకీయాల్లోకి రావడంతో చట్టాలపై అవగాహన కల్పించుకోవడానికి కొంత సమయం పట్టిందని ఆమె అన్నారు. ఇదే విషయాన్ని గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా చర్చించడం జరిగిందన్నారు. మున్సిపల్ నిధులతో ఏ కార్యక్రమం తలపెట్టిన మొదటి పేరు చైర్పర్సన్ పేరు అవుతుందని సభా అధ్యక్షత కూడా తనే అవుతుందని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ నిధులతో ఏ కార్యక్రమం తలపెట్టిన ఆ నిధులు తీసుకొచ్చిన వ్యక్తి అలాగే ఎమ్మెల్యే అధ్యక్షత వహిస్తారని ఆమె తెలిపారు. ప్రోటోకాల్ అనేది గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాటించకపోయినా ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాటించకపోయినా ముమ్మాటికీ తప్పే అని అన్నారు. గత ప్రభుత్వంలోనూ తనను అవమానించారని, ఈ ప్రభుత్వంలో కూడా తనకి అవమానాలు ఎదురవుతున్నాయి ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న కలెక్టర్ కి పిర్యాదు చేసుకోవాలని ఆమె తెలిపారు.ఏది ఏమైన చట్ట పరంగా తనకు దక్కాల్సిన గౌరవం దక్కి తీరలసిందే అని ఆమె తెలిపారు.

# నైతిక రాజకీయాలకు మరో పేరు బత్తిన సుబ్బారావు

**“స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్)” అధ్యక్షులు బర్రే ఆనంద్ కుమార్**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** లక్షలాది మందికి నిలువ నీడ కల్పించిన మహానీయుడు, వేలాది ఎకరాల భూములను, పేదలకు పంచి కూలీలను రైతులుగా మార్చిన మహానుభావుడు, నిరుపేదలను చెరువులపై యజమానులుగా మార్చిన దార్శనికుడు బత్తిన సుబ్బారావు 92వ జయంతిని ఘనంగా స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభగా నిర్వహించారు. నిరుపేదల బాంధవుడు, నిజాయితీ కలిగిన రాజకీయ నాయకుడు దివంగత మంత్రివర్యులు కీర్తిశేషులు బత్తిన సుబ్బారావు 92వ జయంతి కార్యక్రమాన్ని “స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్)” అధ్యక్షులు బర్రే ఆనంద్ కుమార్ సారథ్యంలో రాజమండ్రిలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బర్రే ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, “వందల ఎకరాల చేపల చెరువులపై నిరుపేద ఎస్సీలను యజమానులుగా చేసిన మహానీయుడు, తరతరాలుగా కూలీలుగా బతుకుతున్న బలహీనులకు వేల ఎకరాల ప్రభుత్వ భూములను జీవనాధారంగా పంచిపెట్టి కూలీలను రైతులుగా మార్చిన మహానుభావుడు, ఇల్లు లేని నిరాశ్రయులకు ఐదు సెంట్ల స్థలం ఇచ్చి, లక్షలాదిమందికి నిలువ నీడ కల్పించిన మహోన్నతుడు, నిరుపేదల కష్టాలను బాధలను వారి నుంచి లాక్కొని వారి భవిష్యత్ తరాలకు బంగారు భవితను అందించిన దార్శనికుడు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసి ఆంధ్ర రాష్ట్రంలో అణగారిన వర్గాల నుంచి అత్యధిక సార్లు చట్టసభలకు వెళ్లి చరిత్రను సృష్టించిన యోధుడు, “విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు” నినాదంతో నాటి ప్రధానమంత్రిని సైతం ధిక్కరించి తన మంత్రి పదవికి రాజీనామా చేసి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిన వీరుడు, అభివృద్ధి అణగారిన వర్గాల నుంచి మాత్రమే ఆరంభం అవ్వాలని కాంక్షించిన నిజాయితీపరుడు, నిత్య కృషివులుడు దివంగత మంత్రివర్యులు కీర్తిశేషులు బత్తిన సుబ్బారావు గారిని నేటితరం స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. నేటి రాజకీయ నేతలకు నైతిక విలువలు తెలియాలంటే బత్తిన సుబ్బారావు జీవిత చరిత్రను ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు తెలుసుకొని నేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమం అనంతరం బత్తిన సుబ్బారావుతో కలిసి తిరిగిన పెద్దలకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. అనంతరం పేద మహిళలకు, వృద్ధులకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేసరి గణేష్, శివయ్య, కడియాల విజయ్ బాబు, రామారావు, శామ్యూల్, గారా కృష్ణ, గదమల కొండ, కాకి శాంతి స్వరూప్, గంపల విష్ణు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# వైఎస్ షర్మిలరెడ్డి యాత్రను విజయవంతం చేయండి

- జిల్లా అధ్యక్షులు బోడా వెంకట్
- రాజమహేంద్రవరం అర్బన్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమీక్ష సమావేశం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని,రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ షర్మిల రెడ్డిని చేయడమే కాంగ్రెస్ పార్టీ శ్రేణుల లక్ష్యమని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోడా వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం టి నగర్ లోని రాజమండ్రి అర్బన్ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కొవ్వూరి శ్రీనివాసరావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి అర్బన్ విస్తృతస్థాయి సమీక్ష సమావేశం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గోపాలపురం నియోజకవర్గం, కొవ్వూరు నియోజవర్గం, రాజమండ్రి అర్బన్ నియోజకవర్గాల పరిధిలో పర్యటించినట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టి కాంగ్రెస్ పార్టీ పోటీ చేసేందుకు కృషి చేస్తుందని అన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర మార్చి నెలలో తూర్పుగోదావరి జిల్లాలో ఉంటుందని తెలిపారు ఈ యాత్రను విజయవంతం చేసేందుకు, జన సమీకరణ చేసి విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తూర్పుగోదావరి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో పిసిసి అధ్యక్షురాలు పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకొని కార్యకర్తలు అందరూ జన సమీకరణ చేసి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. సిడబ్ల్యుసి సభ్యులు గిడుగు రుద్రరాజు, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలే వ్రతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం అర్బన్ బాధ్యుడిగా కొవ్వూరు శ్రీనివాస్ రావు ను నియమించినట్లు తెలిపారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్నాల శ్రీనివాస్ ను నియమించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో విభేదాలు ఉన్నప్పటికీ దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని రాష్ట్ర ముఖ్యమంత్రిగా షర్మిలారెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నామని వివరించారు. కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం అర్బన్ బాధ్యుడు కొవ్వూరు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లా స్థాయి రాజమండ్రి అర్బన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాడ వెంకట్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎన్ ఎస్ యు ఐ లో అనేక పదవులు అలంకరించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని అన్నారు ఆయన అనుభవాన్ని ఉపయోగించుకొని జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర విజయవంతం అయ్యేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాజమండ్రి అర్బన్ విసృత స్తాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అరిగేలా అరుణ కుమారి, నగర మహిళా అధ్యక్షురాలు లీలావతి కాంగ్రెస్ పార్టీ నాయకులు జేష్ట సతీష్ బాబు విల్లూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్నాల శ్రీనివాస్, నాయకులు కాటం రవి, చింతాడ వెంకటేశ్వరరావు, జి. సత్యనారాయణ, కాపు చిన్న సత్యనారాయణ, వివిఆర్ చౌదరి, బొనిగే రాంబాబు, కామవరపు వీర్రాజు, కంచర్ల రాజపండు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com



### తొలిదశలో 299 మంది పాత్రికేయులకు

# అక్రిడేషన్ కార్డుల మంజూరు : కలెక్టర్ మహేష్

విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో తొలి దశలో 299 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు అక్రిడేషన్ గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నట్లు జిల్లా అక్రిడేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. పోలీసు విచారణ అనంతరం అర్హులైన జర్నలిస్టుల జాబితాను ఆమోదించి అక్రిడేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అక్రిడేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రూపొందించిన ప్రతిపాదిత జాబితాను సవివరంగా పరిశీలించారు. కమిటీ సభ్యులతో ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉన్నాయా అన్న అంశంపై చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సభ్యుల సూచనల మేరకు అవసరమైన విచారణ పూర్తయ్యాక జాబితాను ఖరారు చేస్తామని కలెక్టర్



తెలిపారు. ఈ సమావేశంలో కన్వీనర్, డీఐపీఆర్ఓ సీహెచ్ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. దుర్గారావు దొరతో పాటు కమిటీ సభ్యులు అప్పాజీ, ప్రసాద్, వెంకట్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### రాబోయే జాతరలు, శివరాత్రి సందర్భంగా

# పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

రాబోయే జాతరలు, శివరాత్రి పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ పరిధిలోని చెయ్యేరు గున్నేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర ఏర్పాట్లను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఫైర్ క్రాకర్స్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, ముమ్మిడివరం సీఐ మోహన్ కుమార్, ఎస్సై జ్వాలా సాగర్‌లకు సూచించారు. మగసాల తిప్పలోని కాల బైరవ స్వామి దర్శనానికి పడవల ద్వారా వెళ్లే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రయాణికులు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించేలా చూడాలని, పడవ సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని స్పష్టం చేశారు. సొంత పడవల వినియోగంలోనూ ఇదే నిబంధనలు పాటించాలని సూచించారు. పోలీస్ కమ్యూనికేషన్ సక్రమంగా ఉండేలా తగినన్ని రిపీటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా పడవలో మగసాల తిప్పకు వెళ్లి కాల బైరవ



స్వామిని దర్శించుకొని, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తు, భక్తుల సౌకర్యాలపై కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రజా భద్రతే పోలీసు శాఖ ప్రథమ ప్రాధాన్యత. పండుగలు, జాతరల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుంది అని ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ వి. పుల్లారావు, ముమ్మిడివరం సీఐ మోహన్ కుమార్, సంబంధిత మండలాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రజక జాతికి వైఎస్ జగన్, జక్కంపూడి రాజాలు

# బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కాకినాడ రామారావు డిమాండ్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రజక జాతి ముద్దు బిడ్డ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గల్లా మాధవిని వైస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరుష పదజాలంతో జుట్టు పట్టుకుని బయటికి లాగుతాం అని మాట్లాడటం చాలా బాధాకరమని, ఈ మాటలు రజక జాతిని అవమానించడంగా భావిస్తున్నామని రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక రజక స్త్రీ, మహిళా శాసన సభ్యురాలు అంటే మీకు అంత చులకనా.. మీ దురహంకారనికి ఇది నిదర్శనంగా



భావిస్తున్నామని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళ ఎమ్మెల్యే అయిన గల్లా మాధవిని మాటలతో అవమానించడం సిగ్గుచేటని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘాలంతా ఐక్యతతో ఇటువంటి దురాహంకారులుకు బుద్ధి చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రజక ముద్దు బిడ్డ గల్లా మాధవికి వైస్సార్సీపీ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి , జక్కంపూడి రాజా బేషరతుగా క్షమాపణ చెప్పాలని రాష్ట్ర రజక చైతన్య సేవా సంస్థ తరుపున డిమాండ్ చేస్తున్నామని రామారావు పేర్కొన్నారు. వైసీపీనేత అంబటి రాంబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను దుర్భాషలాడుతూ తిట్టడం పట్ల సభ్య సమాజం తలదించుకుందన్నారు. ఈ విషయమై ప్రశ్నించి అంబటి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన మహిళా ఎమ్మెల్యే పై ఈ తరహా మాటలు సరికాదని, వైసిపి నాయకులు తమ ప్రవర్తన మార్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు రజక సంఘాల నేతలు పాల్గొన్నారు.

# యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు

**ఐ.పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, ఐ పోలవరం మండలం నందు, పీఎం శ్రీ ఇంటర్వెన్షన్స్ కార్యక్రమంలో భాగంగా ఐ పోలవరం జిల్లా పరిషత్ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు స్థానిక హెచ్ఎం వీధి సురేష్ బాబు గారి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ యొక్క



కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్ మహబూబ్ జహాన్ గారు సిఐ మోహన్ కుమార్ గారు అలాగే ఎస్సై రవీంద్ర బాబు గారు ఏఎస్ఐ ముత్యాల రావు గారు పాల్గొని డ్రగ్స్ వినియోగించడం వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు బాణాపురం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక హెల్త్ టీమ్ వారు తదితర ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా సాగుతున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్

### సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న సేవా ప్రయాణం
### ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంను సన్మానించిన ప్రముఖులు

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం కేంద్రంగా సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామచంద్రపురం, అమలాపురం పట్టణాల్లో ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి పలువురు నాయకులు సత్యం కు అభినందనలు తెలిపారు. వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడుతూ అనతి కాలంలోనే సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సమాజంలో విశేష గుర్తింపు సాధించిందని ప్రశంసించారు. ఎవరికి కష్టం వచ్చినా తామున్నామంటూ ఫౌండేషన్ ద్వారా నిరుపేద పిల్లలను దత్తత తీసుకుని చదివించడం, మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణలు



అందించి ఉపాధి కల్పించడం, నిరుద్యోగ యువత కోసం ఇప్పటివరకు 50కి పైగా ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, వృద్ధులు వికలాంగులు, నిరుపేదలకు ఆర్థిక సహాయాలు అందించడం అభినందనీయమని ప్రశంసించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ జనవరి 26న నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించడం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవా నిరతికు నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టి, విద్య, ఉపాధి, మహిళా సాధికారత లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగుతుందని వెల్లడించారు. సమాజం పట్ల తమ బాధ్యతను నెరవేరుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, తన కుమార్తె శ్రీ సత్య సహకారంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా తమ ఫౌండేషన్ సేవలను మరింతగా విస్తృతం చేస్తామని, ఈ ప్రయాణంలో తమకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి చైర్మన్ వాసంశెట్టి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముచ్చుమిల్లి రోడ్ లో ఉన్న న్యూ లైఫ్ దివ్యాంగుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి పిల్లలకు ఫ్రూట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితురాలికి అండగా ఎన్నారై ఫౌండేషన్ కువైట్ గ్రూపు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

పరోపకారుల సైన్యంగా ముందుకు సాగుతున్న గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హాండ్స్ ఎన్నారై ఫౌండేషన్ కువైట్ గ్రూపు ఉభయగోదావరి జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హాండ్స్ ఎన్నారై ఫౌండేషన్ కువైట్ గ్రూపు మరోసారి మానవత్వాన్ని చాటింది. రాజోలు నియోజకవర్గం, రాజోలు మండలం వ్యవస్థల ముసుకుడి కుమారి అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు సహాయానికి ముందుకొచ్చారు. ఎన్నారై ఫౌండేషన్ కువైట్ గ్రూపు వైస్ ప్రెసిడెంట్ గంటా శేఖర్ పుట్టినరోజు సందర్భంగా కుమారికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ పోలీస్ బ్యూరో సభ్యుడు ఉమ్మడి వరకు చిన్న సుబ్బారావు హాజరై, బాధిత కుటుంబానికి చేతుల మీదగా నగదు అందించారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ సత్తిబాబు, ఆకుమర్తి ఆశీర్వాదం, ఆకుమర్తి శీను, నూటుకుర్తి సత్యనారాయణ, సవరపు సత్యం, నావరపు ఠాగూర్, ఆకుమర్తి మోహన్, ఆకుపర్తి శ్రీను, ముసుకుడి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. బాధితులకు అండగా నిలవడమే తమ లక్ష్యమని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యత

### జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆధ్వర్యంలో 'పోలీస్ గ్రీవెన్స్ సెల్' కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బదిలీలు, సెలవులు, ఆరోగ్య సమస్యలు, సేవా పరమైన ఇబ్బందులపై సిబ్బంది విన్నపాలు



అందజేశారు. ప్రతి సమస్యను శ్రద్ధగా విన్న ఎస్పీ, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, భద్రత తమ మొదటి ప్రాధాన్యత అని ఎస్పీ తెలిపారు. సిబ్బంది మానసిక ప్రశాంతతతో ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని పేర్కొన్నారు. అందుకే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్నెట్ వాడకంలో ఏపీ వెనుకబడిందా..

ఈ జాబితాలో టాప్ ప్లేస్ లో దేశ రాజధాని ఢిల్లీ ఉంది. ఇక్కడ ఇంటర్నెట్ సౌకర్యం లేని గృహాల వాటా కేవలం 2.6% మాత్రమే. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), 5జీ నెట్ వర్క్ తో పాటు ఎటు చూసినా డిజిటల్ గవర్నెన్స్ తో ముందుకు సాగుతున్న పరిస్థితి. అయినప్పటికీ దేశంలోని జనాభా మధ్య డిజిటల్ అంతరం కొనసాగుతోందని.. దేశంలోని ఏడు ఇళ్లల్లో ఒకటి ఆఫ్ లైన్ లో ఉందని.. ఈ క్రమంలో 13.7% గృహాలు ఇప్పటికీ ఇంటర్నెట్ సదుపాయాన్ని కలిగి లేవని రాజ్యసభలో వచ్చిన సమాధానం చెబుతోంది. ఈ జాబితాలో ఢిల్లీ, కేరళ, మహారాష్ట్ర, కర్నాటక టాప్ లో ఉండగా.. ఏపీ, తమిళనాడు, త్రిపుర వెనుకబడి ఉంటటం గమనార్హం! అవును... దేశంలోని డిజిటల్ ప్రోత్సాహం ఆన్ లైన్ సర్వీసులు, డిజిటల్ చెల్లింపులు, డిజిటల్ గవర్నెన్స్, ఏఐ, 5జీ లతో ముందుకు సాగుతున్నప్పటికీ.. ఇంటర్నెట్ యాక్సెస్ మాత్రం అసమానంగానే ఉంది. తాజాగా రాజ్యసభలో పంచుకోబడిన డేటా ప్రకారం... దేశంలోని 13.7 శాతం కుటుంబాలకు ఇప్పటికీ ఇంటర్నెట్ సదుపాయం లేదు. ఈ క్రమంలో.. గత కొన్ని సంవత్సరాలుగా ఇంటర్నెట్ కవరేజ్ మెరుగుపడినప్పటికీ.. డిజిటల్ చేరిక పూర్తిస్థాయిలో లేదు. ఈ విషయంలో రాష్ట్రాల మధ్య అంతరం స్పష్టంగా ఉంది! ఈ జాబితాలో టాప్ ప్లేస్ లో దేశ రాజధాని ఢిల్లీ ఉంది. ఇక్కడ ఇంటర్నెట్ సౌకర్యం లేని గృహాల వాటా కేవలం 2.6% మాత్రమే. అధిక పట్టణీకరణతోపాటు బలమైన మౌలిక సదుపాయాలు, విస్తృత మొబైల్ బ్రాడ్ బ్యాండ్ కవరేజ్ ఈ సార్వత్రిక కనెక్టివిటీకి కారణంగా చెబుతున్నారు. ఆ తర్వాత కేరళలో 8.3% గృహాలకు మాత్రమే ఇంటర్నెట్ సదుపాయం లేకపోగా.. ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర 10.4%, కర్ణాటక 10.9%, బీహార్ 11.7%, రాజస్థాన్ 13.2% ఆఫ్ లైన్ గృహాలతో ఉన్నాయి. అయితే దీనికి పూర్తి విరుద్ధంగా అత్యధిక ఆఫ్ లైన్ గృహాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ 22.3 శాతంతో టాప్ ప్లేస్ లో ఉండటం గమనార్హం. చంద్రబాబు సీఎంగా ఉన్న రాష్ట్రంలో ఈ పరిస్థితి ఇప్పుడు



చర్చనీయాంశంగా మారింది! ఈ క్రమంలో ఏపీ తర్వాత ఈ జాబితాలో అరుణాచల్ ప్రదేశ్ 22.2%, ఒడిశా 22%, తమిళనాడు 21.1%, త్రిపుర 18.8% ఆఫ్ లైన్ గృహాల జాబితాలో ఉన్నాయి. ఇదే క్రమంలో... పుదుచ్చేరి 18.1%, వెస్ట్ బెంగాల్ 16%, మధ్యప్రదేశ్ 15.4%, ఛత్తీస్ గర్ 15.4%, యూపీ 13.9% రాష్ట్రాలు జాతీయ సగటు 13.7% కంటే ఎక్కువ నివాసాల్లో ఇంటర్ నెట్ సదుపాయం లేని రాష్ట్రాలుగా నిలిచాయి! కాగా.. కేంద్ర ప్రభుత్వం ప్రకారం... ఇంట్లో ఎవరైనా సభ్యుడు మొబైల్ నెట్ వర్క్ ఇంటర్నెట్ డేటాను ఉపయోగిస్తున్నా.. ఆ కుటుంబానికి ఇంటి ఆవరణలో ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉన్నట్లు పరిగణించబడుతుంది!

# ఎస్సీ, ఎస్టీలకు న్యాయం అందించడమే కమిటీ లక్ష్యం : ఆర్డీఓ మాధవి

విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే వారికి అండగా నిలవడమే జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ప్రధాన ఉద్దేశమని ఆర్డీఓ కే. మాధవి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అట్రాసిటీ కేసులు, పౌరహక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన దర్యాప్తు పురోగతి, బాధితులకు అందాల్సిన పరిహారం, పునరావాస చర్యల అమలుపై సమీక్షించారు. నమోదైన కేసుల ప్రస్తుత స్థితి, విచారణ వేగం,



చార్జ్‌షీట్‌ల దాఖలు, న్యాయ ప్రక్రియలో బాధితులకు అందుతున్న సహాయంపై చర్చ జరిగింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సామాజిక సమానత్వం, చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. పోలీస్, రెవెన్యూ, సంక్షేమ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, హత్యలు, అత్యాచార ఘటనల్లో సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, కేసులను జాప్యం లేకుండా సీరియస్‌గా పరిష్కరించాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ ఎస్సైలు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంక్షేమ శాఖల అధికారులు, ఎన్‌జీవోలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



# అధిక ధరలకు మద్యం అమ్మేవారిపై కఠిన చర్యలు

## ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరకే మద్యాన్ని విక్రయించాలి : జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయించే మద్యం దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో ఎక్సైజ్ శాఖ అధికారు, మద్యం దుకాణదారులు, లైసెన్స్ హోల్డర్లతో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి.బిందు మాధవ్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో కొంతమంది మద్యం దుకాణదారులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయించడం చట్ట విరుద్ధమని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రభుత్వ నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మద్య విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. మద్యం విక్రయాల్లో దుకాణా దారులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో పారదర్శకంగా మద్యం విక్రయాలు జరిగేలా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందు మాధవ్ మాట్లాడుతూ మద్యం విక్రయాల్లో ప్రభుత్వం మాత్రమే ధరను నిర్వహిస్తుందన్నారు. మద్యం దుకాణదారులు ప్రభుత్వాన్ని ఉద్దేశించిన ఎమ్మార్పీ ధరను తూ.చా తప్పకుండా పాటించాలని ఆయన తెలిపారు. ఎక్సైజ్ శాఖ అధికారు.. ముమ్మర తనిఖీలు నిర్వహించి ఏపీ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ మానిష్ పాటిల్ దేవరాజ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. కృష్ణకుమారి, ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ, ఎక్సైజ్ అధికారులు, మద్యం దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

## బాల్య వివాహ్ విముక్త్ భారత్ రథం ప్రచారం





**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని బాల్య వివాహ్ విముక్త్ భారత్ రథం ప్రచారం ప్రచారం చేస్తోంది. 28 జనవరి 2026 నుండి 12 ఫిబ్రవరి 2026 వరకూ కొనసాగే ఈ ప్రచార కార్యక్రమాన్ని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్.లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ ప్రచార వాహన రథం కాకినాడ జిల్లాలోని అన్ని గ్రామాల్లోని దేవాలయాలు, చర్చిలు, మసీదులు, కల్యాణ మండపాల ప్రదేశాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం కాకినాడలోను, గురువారం పిఠాపురంలోను అలాగే శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం అన్నవరంలోనూ ఈ రథం ప్రచారం చేసింది. స్థానిక శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవాలయం, మసీదు, చర్చి, సుబ్రహ్మణ్యం స్వామి గుడి, మరిడమ్మ తల్లి గుడి, రావిచెట్టు కూడలి, శ్రీ వీరవేంకటసత్యనారాయణ స్వామి దేవస్థానం పాఠశాల ఎదురుగా ఈ రథం ప్రచారం చేసింది. అంగన్వాడీ సిబ్బందితో బాల్య వివాహాల నిరోధ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో క్రాఫ్ట్ కోఆర్డినేటర్ బి.కుమారి మాట్లాడారు. బాల్య వివాహాలను చేయడం, ప్రోత్సాహించడం చట్ట విరుద్ధమని, బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం శిక్షార్హమైన నేరమని తెలిపారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తి కాకుండా వివాహం చేయరాదని అన్నారు. ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే వారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని అన్నారు. బాలికలకు విద్య ఎంతో కీలకమని, చదువు పూర్తి చేయడం ద్వారానే మంచి భవిష్యత్తు సాధ్యం అవుతుందని శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ. పర్వత వెంకటలక్ష్మి పేర్కొన్నారు. తల్లి దండ్రులు, సంరక్షకులు బాల్య వివాహాల నిరోధ చట్టం, చట్టాన్ని పాటించకుంటే కలిగే దుష్పరిణామాలను తెలుసుకుని బాధ్యతగా వ్యవహరించాలని, బాలికలు, బాలురు ఇద్దరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై సమాచారం అందిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112 కి ఫోన్ చేసి చెప్పాలని, ఫిర్యాదులు ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆమె భరోసా ఇచ్చారు. బాల్య వివాహాల నిరోధం, అమలు ప్రచారం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. పిల్లలకు బాల్యం అనేది చదువు, కలలు, భవిష్యత్తు కోసం ఉండాలి. పెళ్లిళ్ల కోసం కాదు. అందరూ కలిసి పని చేస్తేనే బాల్య వివాహ్ విముక్త్ జిల్లాగా మనం మారగలం అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, గ్రామ సభలు, వార్డు సమావేశాల ద్వారా బాల్య వివాహాల నివారణపై ప్రత్యేకంగా చర్చ జరగాలని ఆమె సూచించారు. ఈ ప్రచార రథం నోటీస్ బోర్డుపై స్థానికులు కొందరు సంతకాలు చేసారు. ఈ కార్యక్రమంలో శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ బి.వెంకటరజని, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది బి.లక్ష్మి, అన్నవరం అడ్వకేట్ ఆకాశపు మల్లేశ్వరరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి వెదురపాక గంగా గౌతమి పాల్గొన్నారు.

# మామిడి, జీడిమామిడి తోటల్లో సమగ్ర సస్యరక్షణే మేలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మామిడి, జీడిమామిడి తోటల్లో సమగ్ర సస్యరక్షణ, మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించడమే ఎంతైనా మేలుకరమని కాకినాడ జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, డా.నరసింహారావు పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి, సీతయమ్మపేట, గొంధి కొత్తపల్లి, శంఖవరం గ్రామాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి, జీడిమామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సందేహాలను అక్కికక్కడే నివృత్తి చేశారు. అనంతరం సమగ్ర సస్యరక్షణ, మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులను గురించి కత్తిపూడి సచివాలయం 2 లో రైతులకు అవగాహన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఉద్యాన పంటల్లో పాటించ వలసిన ఎరువుల యామాన్యం గురించి వారిరువురూ విడిగా వివరించారు. మామిడిలో రసం పీల్చే తామర పురుగులు, తేనే మంచు పురుగుల నివారణకు, నవంబర్లో వేప నూనె 5. మిల్లీలు , కార్బన్డిజం 1 గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి అన్నారు. లీటరు నీటిలో డైమెథోయేట్ ను 2 మిల్లీ చొప్పున కలిపి పూత మొదలయ్యేప్పుడు, పిందె తయారు అయ్యే సమయంలో పిచికారీ చేయాలి. ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ, లేదా లామడా సైహలోత్రిన్ 2.0 మి.లీ నీటిలో కరిగే గంధకం 3 గ్రా, ఫిబ్రవరిలో పిప్రోనిల్ 2. మి.లీ మాంకోజబ్ 3 గ్రాముల మందులు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేస్తే చాలా రకాల పురుగులు నివారణ అవుతాయని తెలిపారు. మామిడిలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పూతకు ముందు, పిందె, గోలీకాయల పరిమాణం ఉన్నప్పుడు క్రమం తప్పకుండా ప్రతి ఏటా పిచికారి చేయటం వలన అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు. మామిడి కాయలకు కవర్లు (ఫ్రూట్ కవర్స్) కట్టుకోటం ద్వారా పండ్ల నాణ్యత పెరుగుతుందని వివరించారు. మామిడిలో పిందె ఏర్పడిన తర్వాత ఫిబ్రవరి రెండో వారంలో మొక్కకు 500 గ్రాముల యూరియా, 750 గ్రాముల పోటాష్, 500 గ్రాముల సూపర్ పాస్ఫేట్ చొప్పున ఎరువులు అందించాలని తెలిపారు. జీడిమామిడిలో కొత్త చిగురు వేసేటప్పుడు తేయాకు దోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి లీ, పూత సమయంలో లామడా సైహలోత్రిన్ 2.0 మి.లీ , బటాణి గింజ దశలో ప్రొఫెనోఫాస్ 2 మి లీ, కార్బన్డిజం 1 గ్రా, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని అధికారులు ఇద్దరూ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన, వ్యవసాయ శాఖల సహాయకులు గోవింద రాజులు, రాజు, శ్యామ్ సుందర్, చిన్నారి, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# నెల్లిపూడిలో ఘనంగా రాజులబాబు అన్నసంతర్పణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామంలోని అంబేద్కర్ నగర్ మిగతా కాలనీని ఆనుకుని ఉన్న మెట్టపైని కొండ రాజులబాబు ఆలయం వద్ద రాజులబాబు పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొండపైని ఆలయం దిగువన చెట్టు వద్ద కొండ రాజులబాబు ప్రతిమకు పూజలు చేశారు. ఫల, పుష్ప, నైవేద్యాలను మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో సమర్పించారు. గ్రామ ప్రజలకు సుఖ శాంతులు చేకూరాలని కోరుకున్నారు. సాధారణంగా ఈ సంప్రదాయ వేడుకలను పసుపు, పచ్చని పొలాల వద్ద చెట్టూ చేమ నీడన నిర్వహిస్తారు. ఏటేటా పంటలు బాగా పండాలని, పాడి పశుగణం వృద్ధిచెందాలని రాజుల బాబును వేడుకుంటారు. కూడి వచ్చిన అందరికీ దైవం పేరుతో అన్న సంతర్పణ నిర్వహిస్తారు. ఐతే ఈ సంప్రదాయానికి భిన్నంగా ఆది నుంచి నెల్లిపూడి వాసులు మాత్రం మెట్టను ఉన్న ఆలయం ప్రాంగణంలోనే కొండ రాజులబాబు వేడుకలను ఏటేటా ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. కొండ రాజులబాబు వేడుకలు అంటే అన్న సంతర్పణే ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆ వరవడిని కొనసాగిస్తూ స్థానిక పెద్దలు, నాయకులు, దాతల విరాళాలతో కొండరాజు బాబు గుడి వద్ద అన్నసంతర్పణను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. భక్తులు, పరిసర రైతులు, గ్రామ ప్రజలు తమ కుటుంబీకులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించి, సహపంక్తి భోజనాలు చేసి వేడుకలను విజయవంతం చేసారు. నిర్వాహకులతోపాటు శంఖవరం మండలం జనసేన పార్టీ ఉప అధ్యక్షుడు తలపంటి బుజ్జి (అప్పారావు) ఈ కార్యక్రమానికి తన వంతు భూరి విరాళాన్ని సమర్పించారు. అన్న సంతర్పణ వడ్డనలో సహాయక సేవలను అందించారు.

# ఏపీ బడ్జెట్‌పై ప్రభావం చూపించేవి ఇవేనా..?



ఏపీ వార్షిక బడ్జెట్(2026-27) ను ఈ నెల 14న అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. గత ఏడాది 3.6 లక్షల కోట్ల రూపాయల మేరకు పూర్తి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. దీనిలో వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు.. అదే విధంగా భాషాభివృద్ధి.. సాంస్కృతిక అభివృద్ధికి కూడా నిధులు కేటాయించారు. కానీ, ఈ దఫా ఇవే కాకుండా అనేక అంశాలు.. బడ్జెట్‌పై ప్రభావం చూపించనున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. 1) ద్రవ్య లోటు: ద్రవ్యలోటు అంటే.. ఆదాయానికి-చేసే ఖర్చులకు మధ్య పొంతన లేకపోవడం. ఈ వ్యవహా రం.. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ నెలకొంది. ఆమాట కొస్తే కేంద్రాన్ని కూడా ద్రవ్యలోటు వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్లో దవ్యలోటును ఎంతగా చూపిస్తారన్నది చూడాలి. దీని ఆధారంగానే సంక్షేమ పథకాలకు కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. 2) అప్పులు: ఏ రాష్ట్ర ప్రభుత్వానికైనా ఇప్పుడు అప్పులు తప్పడం లేదు. కేంద్రం కూడా వచ్చే ఆర్థిక సం వత్సరం(2026-27)లో 17 లక్షల కోట్ల రూపాయలను అప్పుగా తీసుకోనున్నట్టు బడ్జెట్లో పేర్కొంది. ఇప్పటికే దేశంలో ఒక్కొక్కరి తలపైనా 1.34 లక్షల రూపాయలు అప్పుగా ఉంది. ఇప్పుడు రాష్ట్ర సర్కారు కూడా అప్పులు చేయకతప్పని పరిస్థితి ఏర్పంది. దీనినిఎంత గా చూపిస్తారన్నది చూడాలి. 3) సంక్షేమ పథకాలు: గత ఏడాదిలోనే ఈ భారం ఎక్కువగా ఉందని ప్రభుత్వం స్వయంగా పేర్కొంది. ఇప్పుడు సంక్షేమ పథకాలు అవే అయినా.. లబ్ధి దారుల సంఖ్య మాత్రం పెరగనుంది. ఈ క్రమంలో ఏమేరకు సంక్షేమ పథకాలకు నిధులు అందిస్తారన్నది చూడాలి. గతంలో కంటే కూడా ఇప్పుడు సంక్షేమం మరింత పెరిగిన నేపథ్యంలో ఈ పథకాలు.. బడ్జెట్‌పై ప్రభావం చూపించనున్నాయి. 4) మౌలిక సదుపాయాలు: ప్రస్తుతం రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. రహ దారుల నుంచి ప్రాజెక్టుల వరకు అనేక మౌలిక సదుపాయాలకు ఇప్పుడు మాత్రమే అవకాశం ఉంటుంది. వచ్చే ఏడాది బడ్జెట్‌లో దీనిని ప్రధానంగా ప్రస్తావించాల్సి ఉంటుంది. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో దీని నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. సో.. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# అత్యంత వైభవంగా ప్రారంభమైన కోటి తులసిపత్రి పూజ




**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం లోని సత్యదేవుని సన్నిధిలో కోటి తులసి పూజలు మాఘ బహుళ పంచమి శుక్రవారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. లోక కళ్యాణార్థం, జన హితం కోరుతూ భారతదేశం సస్యశ్యామలంగా, పాడిపంటలు సమృద్ధిగా ఉండుటకు, పుత్ర, పౌత్రాభివృద్ధి, ప్రజలంతా సుఖఃసంతోషాలతో జీవించాలన్న సత్సంకల్పంతో కోటి తులసి పత్రి పూజలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారి వార్షిక కళ్యాణ వేధికను వివిధ రకాల పుష్పములతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేదికపైగల ప్రత్యేక సింహాసనం మీద స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి ఋత్విక బృందం వైదిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహావచనం, ఋత్విగ్వరుణలు, మంటపారాధన, కలశస్థాపనతో 60 మంది ఋత్వికులు ఈ పూజలకు శ్రీకారం చుట్టారు. కోటి తులసి పత్రి ప్రారంభ పూజల్లో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వేంద్ర త్రినాధరావు దంపతులు, చైర్మన్ ఐవి రోహిత్ పాల్గొని స్వామి, అమ్మ వారికి ఫల, పుష్పములు సమర్పించి అత్యంత నియమ, నిష్టలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పది రోజుల పాటు జరిగే కోటి తులసి పత్రి పూజలు ప్రతీ రోజూ ఉదయం 8 గంటల నుండి 11.30 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహిస్తారు. పూజల్లో ప్రతి రోజూ ఉదయం లింగార్చన, సూర్యనమస్కారములు, వేదపారాయణ కార్యక్రమాలను చేపడతారు. ఈ కోటి తులసి పత్రి పూజలు మాఘ బహుళ త్రయోదశి, ఆదివారము 15 వతేదీ వరకూ జరుగు ప్రతీ రోజూ రాత్రి 7 గంటల నుండి మహా నివేదన, నీరాజన మంత్రపుష్పములు, కైవారములు, చతుర్వేద స్వస్తి, ప్రసాద వితరణ జరుగుతాయి. ఈ బృహత్తర కార్యక్రమంలో తొలి రోజు అత్యధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు, ఆస్థాన వేద పండితులు, ఆలయ అర్చకులు, వ్రత పురోహితులు, స్వామి వారి సేవా బృందం సభ్యులు పాల్గొని శ్రీ స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు అయ్యారు.

# లడ్డూ వివాదం.. తెగేదాకా లాగితే..!



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించారన్న వివాదం నానాటికీ ముదురుతోంది. దీనిపై సీబీఐ అధికారుల నేతృత్వంలో ఇప్పటికే 2024-2026 జనవరి వరకు విచారణ జరిగింది.దీనికి సంబంధించిన నివేదిక కూడా కోర్టుకు చేరింది. అయితే.. దీనిలో ప్రధానంగా నెయ్యి కల్తీ జరిగిందని సిట్ పేర్కొంది. అయితే.. దానిలో జంతువుల కొవ్వు కలిసిందా..? లేదా? అనేవిషయంలో సందేహం వ్యక్తం చేసింది. ఇక, ఈ నివేదిక తమకు అనుకూలంగా ఉందని.. జంతువుల కొవ్వు కలవలేదని సిట్ తమకు క్లీన్ చిట్ ఇచ్చిందని వైసీపీ నాయకులు ప్రచారం చేయడం ప్రారంభించారు. ఇక్కడ నుంచి మరోసారి లడ్డూ లడా యి పుంజుకుంది. అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధంతోపాటు.. దాడుల వరకు ఈ వ్యవహారం దారి తీసింది. ఈ నేపథ్యంలో వాస్తవానికి కూటమి ప్రభుత్వం.. ప్రస్తుత సీబీఐ నివేదిక కోర్టు పరిధిలో ఉంది కాబట్టి.. దీనిని తర్వాత తేల్చుకుంటామని చెప్పి ఉంటే ఇంత వివాదం ఉండేది కాదు. ఇదేసమయంలో వైసీపీ చేసే ఎదురుదాడికి విషయం ఆధారంగా కౌంటర్ ఇచ్చినా బాగుండేది. మరికొన్ని రోజుల్లోనే బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో ఆదిశగా చర్చలను దారి మళ్లించి ఉన్నా.. ఈ వివాదం ఇక్కడితో ఆగిపోయేది. కానీ, ప్రభుత్వం అలా చేయడం లేదు. పైగా.. ఇప్పుడు ప్రత్యేక కమిషన్ వేసి.. వాస్తవాలు వెలుగు చూసేలా చేస్తామని ప్రకటించింది. కానీ, ఈ వ్యవహారం కూడా అంత తేలికగా ముగిసే పరిస్థితి లేదని తెలుస్తోంది. ప్రస్తుతం కోర్టులో ఉన్న సీబీఐ నివేదికపై విచారణ పూర్తి అయి.. కోర్టులు తీర్పులు ఇచ్చాక మాత్రమే ప్రత్యేక కమిషన్ వేసేందుకు రాష్ట్ర సర్కారుకు అవకాశం ఉంటుంది. కానీ, ఇది జరిగే సరికి మరో ఏడాది సమయం పట్టనుంది. ఆ తర్వాత.. కమిషన్ వేసినా.. అది కూడా నోటి మాటగా విచారణ పూర్తి చేసే అవకాశం లేదు. ఏదైనా కూడా ల్యాబులపైనా.. అవి ఇచ్చే నివేదికలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. సో.. మొత్తంగా చూస్తే.. ఈ వ్యవహారాన్ని తెగేదాకా లాగితే.. సమయం వృథా తప్ప.. పెద్దగా కూటమికి ప్రయోజనం ఉంటుందా? అనేది చూడాలి.

# వేళంగిలో 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



## ముఖ్యఅతిథిగా యువ నాయకుడు పంతం సందీప్

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామం కొత్తపేట కాలనీలో ఏర్పాటు చేసినటువంటి ఆంజనేయ స్వామి విగ్రహం నెలకొల్పి శుక్రవారం నాటికి 8 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గ్రామంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద ఆలయ కమిటీ వారు మరియు జనసేన నాయకులు కంచి సత్తిబాబు తనయుడు కంచి తేజ గణేష్ టీం ఆధ్వర్యంలో భారీ ఎత్తున స్వామివారి భక్తులకు సుమారుగా 2000 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. యువ నాయకుడు తేజ గణేష్ ఆహ్వానం మేరకు కాకినాడ రూరల్ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ కుమారుడు యంగ్ లీడర్ పంతం సందీప్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న భక్తులతో , గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందీప్ కు తేజ గణేష్ టీం మరియు వేళంగి గ్రామంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.






## చదివించక మానలేము..
# ఆర్థిక భారం మోయలేము

మోయలేని భారంగా మారిన నేటి విద్యా వ్యవస్థ గురించి ఎంత చెప్పిన తక్కువే. నానాటికి విస్తరస్తున్న విద్యాసంస్థలు..అంబరాన్ని తకుతున్న ఫీజులు. అంతఃపురాలని తలపిస్తున్న బిల్డింగులు. తగ్గేదే లేదు అంటూ ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్న ఫీజులుపైన.. కొందరు తల్లితండ్రులు తెలిపిన వివరాలను ప్రత్యేక కథనంగా మేముందుకు. విస్తరిస్తున్న ప్రైవేట్ విద్యా వ్యవస్థ సామాన్యుడి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ విద్యా సంస్థలు లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నాయి. సామాన్యుడు ఈ ఫీజులను చెల్లించడం సాధ్యం కావడం లేదు. తల్లితండ్రులు తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని తహతహలాడుతున్నారు. వారు తమ రక్తామాంసాలు దారబోసి చదివిస్తున్నారు. కానీ ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయడంలో వెనుకంజ వేస్తున్నాయి. ప్రైవేట్ విద్యా వ్యవస్థ వల్ల కుటుంబ వ్యవస్థ అవస్థలకు గురవుతోంది. తల్లితండ్రులు తమ పిల్లల చదువుకోసం అప్పులు చేస్తున్నారు. కొంతమంది తల్లితండ్రులు తమ పిల్లలను చదివించలేక నిరాశకు గురవుతున్నారు. వారు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని తల్లితండ్రులు మరియు ప్రజలు కోరుతున్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి.ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం విద్యా ఖర్చులను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలి. విద్యా వ్యవస్థలోని సమస్యలను పరిష్కరించడం ద్వారా సామాన్యుడి జీవితం మెరుగుపడుతుంది. సామాన్యుడు తన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించగలుగుతాడు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సామాన్యుడి భవిష్యత్తు మెరుగుపడుతుంది. ప్రభుత్వాలు మరియు మేధావులు కలిసి విద్యా వ్యవస్థలోని సమస్యలను పరిష్కరించాలి. సామాన్యుడికి విద్య అందుబాటులోకి తేవాలి. దేశం అభివృద్ధి చెందాలి.. అని తల్లితండ్రులు చేతులు జోడించి వేడుకుంటున్నారు.

# బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం


**ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.శ్రీదేవి - సామూహిక శ్రీమంతాల్లో పాల్గొన్న బత్తుల దంపతులు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి అందరం కలిసి పని చేద్దామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి శ్రీదేవి అన్నారు.శుక్రవారం కోరుకొండ సచివాలయం ప్రాంగణంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కోరుకొండ గోకవరం సీతానగరం మండలాల నుండి అంగన్వాడి సిబ్బంది పెద్ద ఎత్తున విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ పిడి టి శ్రీదేవి, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న "బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్", "మిషన్ వాత్సల్య పథకాల"పై అవగాహన కార్యక్రమాన్ని గత ఏడాది నవంబర్ 27వ తేదీ నుండి మార్చి 8తేదీ వరకు వందరోజుల పాటు జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను తెలియజేస్తూ, హిందూ ముస్లిం క్రైస్తవ మతపెద్దలు బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం చట్టపరంగా తీసుకునే చర్యలపైన అవగాహన కల్పించారు. అదే విధంగా బాలల సంరక్షణ, బాలల పరిరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాలు, భ్రూణ హత్యల నిర్మూలన అంగన్వాడి సిబ్బంది కృషితోనే సాధ్యమైందని ప్రశంసించారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు పెద్ద ఎత్తున నిర్వహించి, గర్భిణీలకు పసుపు కుంకుమ పువ్వులు పండ్లు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ గణేష్, ఎంపీడీవో బత్తిని అశోక్ కుమార్, ఎంఈఓ టి కుశలోవ దొర, పీహెచ్సీ వైద్యఅధికారి జ్ఞానచంద్ర, ఐసిడిఎస్ పిఓ డి సంధ్యారాణి, బదిరెడ్డి దొర,కటకం చలం, అంగన్వాడి సిబ్బంది, సెక్రెటరీ నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో గోదావరి పుష్కరాలను విజయవంతం చేయాలి

**కలెక్టరేట్‌లో గోదావరి పుష్కరాల సన్నద్ధతపై సమీక్ష - నియోజకవర్గాల వారిగా ప్రజా ప్రతినిధులు నుంచి ప్రతిపాదనలు స్వీకరించాలి**
**సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలి - గోదావరి పరివాహక ప్రాంతంలో ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుణ్యఫలమే - పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమిష్టి కృషితో 2027 జూన్ 26న ప్రారంభమై జులై 7న ముగిసే 12 రోజుల గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవంతంగా నిర్వహించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.శుక్రవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జనవరి 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి కొనసాగింపుగానే జిల్లా స్థాయి సమీక్షను నిర్వహించినట్లు తెలిపారు. పుష్కరాల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ, పర్యాటక, ఇరిగేషన్, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. త్వరలోనే రాష్ట్ర స్థాయి అధికారులు, హెచ్‌వోడీలతో కలిసి పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టెంపుల్ సర్క్యూట్లు ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. నవ జనార్ధన పారిజాతం (వైష్ణవ క్షేత్రాలు), ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలను అనుసంధానిస్తూ పర్యాటక ప్యాకేజీలురూపొందించనున్నట్లు తెలిపారు. పాపి కొండల పర్యాటకాన్ని కూడా పుష్కరాల పర్యాటక ప్రణాళికలో భాగం చేస్తామని వెల్లడించారు.కోట్లాది మంది భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కుంభమేళా తరహాలో అత్యున్నత ప్రమాణాలతో టెంట్ సిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హోమ్ స్టే పాలసీని ప్రోత్సహిస్తూ, ఉభయ గోదావరి జిల్లాల్లోని మండువా లోగిళ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుణ్యఫలం సమానమే అన్న విషయంపై భక్తుల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించామన్నారు. గోదావరి నది తీరంలో గుర్తించిన ఏ ఘాట్ లో స్నానం చేసినా పుణ్యఫలమే అన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలియ చేశారు. ఇందుకు ప్రముఖ ప్రవచనకర్తలు చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావుల తదితరులు ద్వారా విస్తృత ప్రచారం చేపడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాస్కి స్కీమ్ కింద రూ.97 కోట్లతో చేపట్టిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనులను పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. పుష్కర్ ఘాట్ అభివృద్ధి, హేవలాక్ వంతెన ఆధునికీకరణ, బ్రిడ్జిలంక వాటర్ స్పోర్ట్స్, కడియం ఎక్స్‌పీరియన్స్ సెంటర్, నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయ అభివృద్ధి, సెట్టిపేట బోట్ షికారు వంటి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల కనెక్టివిటీ కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.1000 కోట్లకు పైగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. శాంతిభద్రతలు, పార్కింగ్ స్థలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీకి సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి అన్ని పనులు ఇప్పటికే ఉన్న బడ్జెట్ కు అనుగుణంగా, స్పష్టమైన లక్ష్యాలు, సమ్మతమైన విధానం ఉండాలన్నారు. అందుకు అనుగుణంగా సమ్మతమైన రీతిలో ఆయా శాఖకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపే ప్రతిపాదనలు స్పష్టంగా ఉండాలని, వాటి వివరాలు హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ల దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ కేటాయింపులు జరిగేలా సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. పుష్కర్ ఘాట్ల వద్ద అండర్‌గ్రౌండ్ కేబుల్ వర్క్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ ఏ శాఖల ద్వారా నిధులు పొందే అవకాశం ఉందో గుర్తించి, ఆయా శాఖల ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. అప్పుడే వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల ద్వారా విడుదల చేసే గ్రాంట్సు సమీకరించుకుని వాటిని ఆచరణ సాధ్యం చెయ్యగలం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి తదితరులు ద్వారా పుష్కరాలకు చెందిన కేంద్ర గ్రాంట్స్ సాకారం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖల ద్వారా ప్రతిపాదించిన పనుల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని కోరారు. నియోజక వర్గంలో గోదావరి నది ఏడు పంచాయతీల మీదుగా ప్రవహిస్తోందని, అన్ని ఘాట్లకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జాతీయ రహదారి మార్గాలకు అనుసంధానంగా ఉన్న అంతర్గత రహదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నియోజక వర్గం పరిధిలో ఘాట్స్, టెంపుల్స్ అభివృద్ధి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ స్నాన ఘాట్ల సమీపంలో దాతలు ఇచ్చిన స్థలాల్లో ప్రధాన కార్యక్రమాల కోసం షెడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. టెంపుల్ టూరిజం, ఇరిగేషన్, రహదారుల అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పుష్కరాలకు ఇంకా 15 నెలల సమయమే ఉన్నందున ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలని సూచించారు. ఆలయాల అభివృద్ధి, రహదారి విస్తరణ, ఔటర్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఏ ఏ దేవాలయాలు అభివృద్ధి చేస్తున్నారో నివేదిక ఇవ్వాలని, ఇంకా కొన్ని ప్రముఖ దేవాలయాలు ఉన్నాయని, వాటికి చెందిన ప్రతిపదనలు పంపాలని స్పష్టం చేశారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాల్లో రహదారి పనులు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ దేవాదాయ, ఇరిగేషన్, రహదారులు ఇతర ప్రధాన శాఖల ప్రతిపాదనలపై ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ డి. నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఆర్డీవోలు కె. భాస్కర్ రెడ్డి (ఇంచార్జి), రాణి సుస్మిత, కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జగన్ ఎందుకు
# క్షమాపణ చెప్పాలి

**కొండపల్లి దుర్గారావు**
**అంబటి ఇంటిపై దాడి చేసినవారిని శిక్షించాలనడం తప్పా?**
**రజకులపై జరిగిన దాడులపై మాట్లాడని వాళ్ళా విమర్శించేది**



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** మాజీ మంత్రివర్యులు అంబటి రాంబాబు ఇంటిపై గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి దాడికి దిగడం దారుణమని తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు, ఉమ్మడి జిల్లాల రజక సంఘం అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభ్యులుగా ఉండి దాడులకు దిగడం తప్పని చెప్పినందుకు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పాలంటూ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కాకినాడ రామారావు చేసిన ప్రకటనను దుర్గారావు ఎద్దేవా చేసారు. ఇళ్లపై దాడులకు దిగితే ప్రజలు సహించబోరని, ఎక్కడున్నా జుట్టుపట్టుకుని ప్రజలే ఈడ్చుకు వస్తారని జక్కంపూడి రాజా అనడంలో తప్పేముందన్నారు. కులాల పేర్లు జోడించి, ఆడియో క్లిప్పింగ్ లో మార్ఫింగ్ చేసి,కటింగ్ లు చేసి కులం పేరుతొ విమర్శించినట్లు లేనిపోని ఆరోపణలు చేయడం, క్షమాపణ చెప్పాలనడం తగదని ఆయన హితవు పలికారు. జగన్ హయాంలో రజకులకు చేదోడు పథకం తీసుకొచ్చి, ఆర్థిక సాయం అందించినందుకు క్షమాపణ చెప్పాలా? అన్నారు.రాజానగరం నియోజకవర్గంలో రజకులకు పథకాలన్నీ వర్తించేలా చేసి, వారి సంక్షేమాన్ని చూసినందుకు జక్కంపూడి రాజా క్షమాపణ చెప్పాలా అని ప్రశ్నించారు. రజకుల పేరుచెప్పికుని, ఓట్లు దండుకుని ఎమ్మెల్యే అయినవాళ్లు రజకుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.దేశ చరిత్రలో తొలిసారిగా రజకులకు 10వేలు ఆర్థికసాయం చేసిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. జగన్ పాలనలో 4ఏళ్లలో 400కోట్ల రూపాయల సాయం రజకులకు అందిందన్నారు. నవరత్నాల పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రజకులకు 7వేలకోట్లకు పైగా లబ్ది చేకూరుతుందని గుర్తు చేశారు.చంద్రబాబు రజకులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా కృషిచేయాలని రామారావుకి కొండపల్లి సూచించారు. రజకులను ఎస్సీలలో చేరుస్తామన్న హామీ నెరవేర్చేలా చూడాలని ఆయన హితవు పలికారు.

# భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణ హర్షణీయం

**చంద్రబాబు, పవన్, సుభాష్, ఆదిరెడ్డి శ్రీనివాస్, వలవలకు కృతజ్ఞతలు : అధ్యక్షుడు బొజ్జా రామకృష్ణ**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించడం హర్షణీయమని భవన నిర్మాణ కార్మికుల సమైక్య అధ్యక్షులు బొజ్జ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రాజమండ్రి విక్రమ హాల్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ , వలవల మల్లికార్జున బాబ్జి లు తీసుకున్న నిర్ణయం హర్షనీయమని ఆయన పేర్కొన్నారు. గత 8 సంవత్సరాల కాలంగా భవన నిర్మాణ కార్మికులకు అందవలసిన సంక్షేమ ఫలాలు అందకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ లో ఉన్న 48 వేల క్లైమ్లను రెన్యువల్ చేసి సంక్షేమ పథకాలు వెంటనే అందించాలని సూచించారు. కార్మిక సంక్షేమ బోర్డులు పునరుద్ధరిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన మంత్రివర్గ సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు వెంటనే తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకొని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందాలని కార్మికులకు పిలుపు ఇచ్చారు. కార్పెంటర్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు తమ సభ్యత్వాలను జన్యువల్ చేసుకోవడం ద్వారా పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ప్రభుత్వ అందించాల్సిన మిగతా పథకాలు కూడా త్వరగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజరాజ నరేంద్ర పెయింటర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు కూరపాటి రాజన్ బాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చడం ఆనందదాయకమైన అన్నారు. వెంటనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలని పిలుపు ఇచ్చారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కార్మిక సంక్షేమ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎంవి జీవీ ప్రసాద్,సెక్రటరీ శ్రీనివాస్ బుజ్జి, సెక్రెటరీ ప్రసాద్, రాజమహేంద్రవరం ప్లంబర్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కొండపల్లి నాగేశ్వరావు,సెక్రెటరీ ఈదలాడ రాంబాబు, సెక్రెటరీ రెడ్డి వెంకటప్పలనాయుడు, తాపీ పనివాళ్ల సంఘం ప్రెసిడెంట్ బలుసు నాగేశ్వరరావు, సెక్రెటరీ రాజశేఖర్, రాజమండ్రి రాడ్ బెండింగ్ అండ్ సెంట్రింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ ఆర్ వి మల్లేశ్వరరావు, సెక్రటరీ భాష,వైస్ ప్రెసిడెంట్ తాటిపూడి వినాయకరావు, విగ్నేశ్వర బోర్డు సెంట్రింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ సుంకర వెంకటేశ్వరరావు, సెక్రెటరీ మీసాల గణేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ మహేష్ పాల్గొన్నారు.

## ధవళేశ్వరం బిఎస్ఎన్ఎల్
# కస్టమర్ సర్వీస్ సెంటర్ ప్రారంభం




**ధవళేశ్వరం, విశ్వంవాయిస్ న్యూస్ :** శుక్రవారం ఉదయం స్థానిక ధవళేశ్వరం బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజిలో గల సిఎస్ సి (కస్టమర్ సర్వీస్ సెంటర్)ను బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్, ఐటిఎస్ పలివెల రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా పిజిఎం మాట్లాడుతూ ధవళేశ్వరం, పరిసర ప్రాంత ప్రజల కోరిక మేరకు ధవళేశ్వరం కస్టమర్ సర్వీస్ సెంటర్ ను ఫ్రాంచైసీ బక్కి సురేష్ కుమార్‌కు కేటాయించి బిఎస్ఎన్ఎల్ ఫ్రాంచైసీ భాగస్వామ్యంలో ఇటువంటి మరిన్ని ఓసిఎస్సిలను త్వరలో ప్రారంభిస్తున్నామని, తద్వారా వినియోగదారులకు మరింత చేరువ అవుతామని తెలిపారు. ఈకార్యక్రమంలో డిజీఎంలు సిహెచ్ విజయభాస్కర రెడ్డి, శైలజ, ఐఎఫ్ఏ, ఏజీఎంలు బమ్మిడి శ్రీనివాస్, శారద, జయశ్రీ మరియు స్టే నాగార్జున, బిఎస్ఎన్ఎల్ పిఆర్‌వో వాసు, బిఎస్ఎన్ఎల్ సిబ్బంది, ఫ్రాంచైజ్ సిబ్బంది సురేష్, ఆశ పాల్గొన్నారు.

## అవగాహన లేకుండా
# మాట్లాడం సబబు కాదు

**శిలాఫలకాల ప్రోటోకాల్‌లో అనుమానాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేసుకోండి...**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణ మున్సిపల్ చైర్మన్ హోదాలో వున్న పతివాడ దుర్గ రాణి కనీస అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఎంత వరకు సమంజసమో ఆవిడ విజ్ఞతకే వదిలేస్తున్నట్లు 11వ వార్డు కౌన్సిలర్ కొవ్వాడ బేబి అప్పన్నబాబు, 17వ వార్డు కౌన్సిలర్ కాళ్ళకూరి స్వరాజ్యభవాని శ్రీనివాస్ లు పేర్కొన్నారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఆవిడకు అవమానం జరిగిందని చెప్పడం హాస్యాస్పదం గా ఉందన్నారు. కౌన్సిల్ చట్టాలపై అవగాహన పెంచుకుని అప్పుడు ప్రెస్ మీట్ లు పెడితే బాగుంటుందన్నారు. అయితే ఒక విషయం మాత్రం ఆవిడ నిజం చెప్పారన్నారు. ఎమ్మెల్యే అంటే ప్రోటోకాల్ ప్రోటోకాల్ అంటే ఎమ్మెల్యే అంటారుగా అని అన్నారని, అది అక్షరాల నిజమని పేర్కొన్నారు. ఆరు నూరైనా నూరు ఆరైనా ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రోటోకాల్ పాటించి తీరతారని స్పష్టం చేశారు. గతం లో ప్రోటోకాల్ పక్కన పెట్టీ తప్పుడు శిలాఫలకాలు ఏర్పాటు చేయడం దానిపై పిర్యాదు చేస్తే అధికారులు మార్చడం ఇలాంటివి వైసిపి నాయకుల హయాంలో జరిగిందని విమర్శించారు. ఇటువంటి చరిత్ర వారికి ఉందేమో తమకు లేదన్నారు. తమ నాయకుడు వేగుళ్ళ ఎప్పుడూ విలువలకు కట్టుబడి వ్యవహరిస్తారని స్పష్టం చేశారు.గతం లో వైసీపీ నాయకులు సభా మర్యాదలు విస్మరించి ఎన్ని తప్పుడు పనులు చేసినా కూటమి అధికారం లో ఉండగా మాత్రం మీరెంతో స్వేచ్ఛగా సభలకు వచ్చి మాట్లాడుతున్నారంటే అందుకు ఎమ్మెల్యే వేగుళ్ళ మంచితనం, విలువలే కారణమన్నారు. ప్రెస్ మీట్ లు పెట్టీ మాట్లాడేటప్పుడు వెనుక ముందు ఆలోచించి నడుచుకోవాలన్నారు. శిలాఫలకం ప్రోటోకాల్ విషయం లో అనుమానాలు ఉంటే నిస్సందేహం గా అధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. నిబంధనలు, చట్టాలుపై అవగాహన లేకుండా మరోసారి ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు.

క్రీడా వాయిస్

# టీ20 ప్రపంచకప్ నుంచి హర్షిత్ రాణా..

## హైదరాబాదీ పేసర్‌కు లక్కీ ఛాన్స్..?



ఫిబ్రవరి 4, 2026న దక్షిణాఫ్రికా తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో టీమిండియా ఆల్ రౌండర్ హర్షిత్ రాణా గాయపడ్డాడు. దీంతో ఫిబ్రవరి 5, 2026న తదుపరి పరీక్షల కోసం అతన్ని ఆసుపత్రికి పంపారు. పరీక్షల్లో అతని మోకాలిలో వాపు ఉన్నట్లు తేలింది. 2026 టీ20 ప్రపంచ కప్ నకు ముందు భారత క్రికెట్ జట్టుకు భారీ షాక్ తగలనుంది. ఫిబ్రవరి 4, 2026న ప్రాక్టీస్ మ్యాచ్ లో బౌలింగ్ చేస్తున్నప్పుడు భారత ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా కుడి మోకాలికి గాయమైంది. దీని కారణంగా, 2026 టీ20 ప్రపంచ కప్ నుంచి హర్షిత్ రాణా దూరమయ్యాడు. ఈ పరిస్థితిలో, హర్షిత్ రాణా స్థానంలో మహ్మద్ సిరాజ్ కు అవకాశం ఇవ్వవచ్చని చెబుతున్నారు.రేపటి నుంచి 2026 టీ20 ప్రపంచ కప్ ప్రారంభం.. 2026 ౨20 ప్రపంచ కప్ రేపు, ఫిబ్రవరి 7, 2026న ప్రారంభమవుతుంది. టోర్నమెంట్ మొదటి రోజున మొత్తం 2 మ్యాచ్‌లు జరుగుతాయి. దీని ప్రకారం, భారత జట్టు మొదటి రోజు సాయంత్రం 7 గంటలకు వాంఖడే స్టేడియంలో అమెరికాతో తలపడుతుంది. ఈ టోర్నమెంట్ ప్రారంభానికి ముందు, భారత జట్టు బలమైన జట్టును సిద్ధం చేయడం చాలా ముఖ్యం.

**హర్షిత్ రాణాకు ఏమైంది..?**

దక్షిణాఫ్రికాతో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్ లో హర్షిత్ రాణాకు గాయమైంది. వైద్య పరీక్షల్లో అతని మోకాలిలో వాపు కనిపించింది. లాటరల్ మెనిస్కస్‌కు గాయం ఉన్నట్లు తేలింది. బీసీసీఐ సూచనల మేరకు ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దిన్షా పార్దివాలా హర్షిత్ రాణాకు చికిత్స చేస్తున్నారు. శస్త్రచికిత్స లేకుండా కోలుకోవడం అసంభవమని వైద్య బృందం చెబుతోంది.

**మహమ్మద్ సిరాజ్ కు అవకాశం ఉందా?**

భారత టీ20 ప్రపంచ కప్ జట్టులో హర్షిత్ రాణా స్థానంలో మహమ్మద్ సిరాజ్ రావచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. హర్షిత్ రాణా స్థానంలో ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, భారత 15 మంది సభ్యుల జట్టులో రాణా స్థానంలో సిరాజ్ రాణాకు అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి.

**టీ20 ప్రపంచ కప్ కోసం 15 మంది సభ్యుల భారత జట్టు:**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), హర్షదీప్ సింగ్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్.

# అండర్ 19 ప్రపంచకప్ విజేతగా భారత్..




హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన అండర్ 19 ప్రపంచకప్ 2026లో భారత జట్టు ఘన విజయం సాధించింది. భారత్ అందించిన 412 పరుగుల టార్గెట్‌ను చేరుకోలేక ఇంగ్లాండ్ జట్టు కేవలం 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత జట్టు 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి, ఆరోసారి విజేతగా నిలిచింది. భారత జట్టు ఆరోసారి అండర్-19 ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. శుక్రవారం ఇంగ్లాండ్‌పై భారత జట్టు 100 పరుగుల భారీ విజయాన్ని సాధించింది. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో 50 ఓవర్లలో 9 వికెట్లకు 411 పరుగులు చేసింది. భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్సర్లతో 175 పరుగులు చేశాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే 53 పరుగులు చేశాడు. సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. 412 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌట్ అయింది. ఆర్.ఎస్. అంబ్రిస్ మూడు వికెట్లు పడగొట్టగా, కాలేబ్ ఫాల్క్‌నర్ 115 పరుగులు చేశాడు. ఒక ఎండ్ నుంచి దూకుడుగా ఆడాడు. కానీ, మరో ఎండ్‌లో వికెట్లు పడిపోతూనే ఉన్నాయి. ఇది ఇంగ్లాండ్ ఓటమికి దారితీసింది.

**ఇరు జట్లు:**

ఇంగ్లాండ్ ఖ19 (ప్లేయింగ్ XI): బెన్ డాకిన్స్, జోసెఫ్ మూర్స్, బెన్ మేయస్, థామస్ రెవ్ (కెప్టెన్, కీపర్), కాలేబ్ ఫాల్కనర్, రాల్ఫీ ఆల్బర్ట్, ఫర్హాన్ అహ్మద్, సెబాస్టియన్ మోర్గాన్, జేమ్స్ మింటో, మానీ లమ్స్‌డెన్, అలెక్స్ గ్రీన్.

ఇండియా ఖ19 (ప్లేయింగ్ XI): ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హత్రే(కెప్టెన్), విహాన్ మల్హోత్రా, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు(కీపర్), అంబరీష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, హెనిల్ పటేల్, దీపేష్ దేవేంద్రన్.

# సెంచరీతో దుమ్మురేపిన వైభవ్..

## ఇంగ్లండ్ ముందు భారీ టార్గెట్



అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతోంది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో నిర్ణీత 50 ఓవర్లలో భారత జట్టు 9 వికెట్లకు 411 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లండ్ జట్టు ముందు 412 పరుగుల టార్గెట్ నిలిచింది. అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్లో ఇంగ్లాండ్ కు భారత్ 412 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. హరారే స్పోర్ట్స్ క్లబ్ లో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 411 పరుగులు చేసింది. కనిష్క్ చౌహాన్ 37 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు.వైభవ్ సూర్యవంశీ 80 బంతుల్లో 175 పరుగులకు అవుటయ్యాడు. 218.75 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ 15 ఫోర్లు, 15 సిక్సర్లు బాదాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53 పరుగులు) అర్ధ సెంచరీ సాధించాడు. అభిజ్ఞాన్ కుందు 40, వేదాంత్ త్రివేది 32, విహాన్ మల్హోత్రా 30 పరుగులు చేశారు.జేమ్స్ మీటో 3 వికెట్లు పడగొట్టగా, సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ తలా 2 వికెట్లు పడగొట్టారు.



సినీ వాయిస్ CINEMA

# షాపింగ్ మాల్ ఓపెనింగ్‌లో శ్రీలీల..

## పవన్ కల్యాణ్ పాటకు సూపర్బ్ డ్యాన్స్..

శ్రీలీల అంటే హుషారెత్తించే డ్యాన్స్ లకు పెట్టింది పేరు. 'పుష్ప 2' సినిమాలో డ్యాన్సింగ్ ఐకాన్ అల్లు అర్జున్ తో పోటీ పడి మరీ స్టెప్పులేసిందీ అందాల తార. తాజాగా ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్ కు హాజరైన శ్రీలీల మరోసారి తన డ్యాన్స్ తో అదరగొట్టింది. జయాపజయాలతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తోంది శ్రీలీల. ఇప్పుడు తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషా చిత్రాల్లోనూ నటిస్తూ బిజీ బిజీగా ఉంటోంది. అలా ఈ సంక్రాంతికి పరాశక్తి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిందీ అందాల తార. సుధా కొంగర తెరకెక్కించిన ఈ మూవీలో శివకార్తికేయన్ హీరోగా నటించాడు. భారీ అంచనాలతో రిలీజైన ఈ మూవీ పెద్దగా ఆడలేదు. దీనికి తోడు ఈ మూవీ కేవలం తమిళంలో మాత్రమే విడుదలయ్యింది. దీంతో ఈ పీరియాడికల్ యాక్షన్ మూవీలో శ్రీలీల యాక్టింగ్ ను తెలుగు ఆడియెన్స్ మిస్ అయ్యారు. అయితే వచ్చే నెలలలోనే మరో క్రేజీ ప్రాజెక్టుతో మన ముందుకు రానుందీ ముద్దుగుమ్మ. హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమాల సంగతి పక్కన పెడితే.. షాపింగ్ మాల్స్ ఓపెనింగ్స్ ఇతర కార్యక్రమాలతోనూ శ్రీలీల బిజీగా ఉంటోంది. తాజాగా హైదరాబాద్‌లోని ఓ మాల్ ఓపెనింగ్‌కు హాజరైంది శ్రీలీల. ఈ సందర్భంగా తన డ్యాన్సింగ్ ట్యాలెంట్ ను మరోసారి బయట పెట్టిందీ అందాల తార. అక్కడికి వచ్చిన అభిమానుల కోరిక మేరకు డ్యాన్స్‌తో అదరగొట్టేసింది. పవన్ కల్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్‌లోని దేక్‌లేంగే సాలా అంటూ సాగే పాటకు హుషారైన స్టెప్పులు వేసింది. శ్రీలీల ఎనర్జిటిక్ డ్యాన్స్ ను చూసి అక్కడున్న వారందరూ ఫిదా అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.

# ఆనంద్ దేవరకొండ 'తక్షకుడు' మూవీ హీరోయిన్ ఎవరో గుర్తు పట్టారా?

## టీనేజ్‌లోనే ఆస్కార్ రేసులో నిలిచి..



ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ సినిమా తక్షకుడు. ఇటీవలే ఈ మూవీ టీజర్ రిలీజ్ కాగా ఆడియెన్స్ నుంచి మంచి స్పందన వచ్చింది. అయితే ఈ టీజర్ లో కేవలం ఒకే ఒక్క ఫ్రేములోనే కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది హీరోయిన్. మరి ఇంతకీ ఎవరీ బ్యూటీ? విజయ్ దేవరకొండ సోదరుడు ఆనంద్ దేవరకొండ డిఫరెంట్ సినిమాలతో ఆడియెన్స్ ను అలరిస్తున్నాడు. భిన్నమైన కథలను ఎంచుకుంటూ హిట్స్ కొడుతున్నాడు. ఇదే కోవలో అతను నటించిన మరో సినిమా తక్షకుడు. వినోద్ అనంతోజు ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. గతంలో వీరి కాంబినేషన్ లో వచ్చిన 'మిడిల్ క్లాస్ మెలోడీస్' సూపర్ హిట్ గా నిలిచింది. అయితే ఈ మూవీకి పూర్తి భిన్నంగా తక్షకుడు తెరకెక్కింది. ప్రేమలు, ప్రతీకారం వంటి అంశాలతో ఫుల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఈ మూవీ రూపొందిందని సమాచారం. అందుకు తగ్గట్టే ఇటీవల రిలీజైన ఈ మూవీ టీజర్ చాలా ఇంట్రెస్ట్ గా ఉంది. ఆనంద్ దేవరకొండ లుక్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. టీజర్ రిలీజ్ తర్వాత తక్షకుడు సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. తక్షకుడు మూవీలో హీరో ఆనంద్ దేవరకొండ కళ్లులేని వాడిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ మూవీలో నటించిన హీరోయిన్ గురించి ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చ జరుగుతోంది. తక్షకుడు టీజర్ లో ఆమె కేవలం ఒక్క ఫ్రేములోనే కనిపించింది. అయినా తన లుక్స్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. మరీ ఇంతకీ ఎవరీ బ్యూటీ? తక్షకుడు మూవీలో నటిస్తోన్న హీరోయిన్ పేరు నితాన్సీ గోయల్. గతంలో 'లాపతా లేడీస్' వంటి ఆస్కార్ నామినేటెడ్ మూవీలో అమాయకపు చూపులతో అందరినీ ఫిదా చేసిందీ ఈ ముద్దుగుమ్మనే. అంతేకాదు తన క్యూట్ యాక్టింగ్ తో ఎన్నో అవార్డులు కూడా కొల్లగొట్టిందీ అందాల తార. దీని కంటే ముందు చైల్డ్ ఆర్టిస్ట్ గా పలు టీవీ సీరియల్స్ లో నటించింది నితాన్సీ. 'విక్కీ డోనర్', 'ఎంఎస్ ధోని', 'ఇందు సర్కార్' తదితర సినిమాల్లోనూ బాల నటిగా మెప్పించింది. ఇక 'లాపతా లేడీస్' (2024) మూవీ చేసేటప్పటికీ నితాన్సీ వయసు కేవలం 17 ఏళ్లు మాత్రమే. దీని తర్వాత మైదాన్ మూవీలో యాక్ట్ చేసిందీ అందాల తార. ఇప్పుడు తక్షకుడు సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను పలకరించేందుకు రెడీ అయ్యిందీ ముద్దుగుమ్మ.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com